Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699


# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU


ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 161 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శనివారం, 31 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## మేము అధికారంలో ఉన్నంత వరకూ సహించం..రాహుల్‌కు అమిత్‌షా వార్నింగ్



**న్యూఢిల్లీ:** రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇచ్చిన విందులో ఆమె ఇచ్చిన గమోసా (స్కార్ఫ్)ను రాహుల్ గాంధీ ధరించకపోవడంపై కేంద్ర మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీ ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చని, అయితే బీజేపీ అధికారంలో ఉన్నంత వరకూ ఆయనను ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని అగౌరవ పరిచేందుకు అనుమతించమని అన్నారు. అసోంలోని డిబ్రూగఢ్‌లో జరిగిన కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ, విదేశీ ప్రముఖులతో సహా అక్కడికి హాజరైన వారంతా గౌరవ సూచకంగా గమోసా వేసుకున్నారని, అందుకు నిరాకరించిన ఏకైక వ్యక్తి రాహుల్ మాత్రమేనని అన్నారు. దీనిపై బీజేపీతో పాటు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ కూడా రాహుల్‌ను తప్పుపట్టారు. అస్సాం సహా ఈశాన్య రాష్ట్రాల సంస్కృతిని రాహుల్ గౌరవించడం నేర్చుకోవాలని, లేదంటే ఆయన ఓట్లు అడగరాదని అన్నారు. ఈ ఏడాది అస్సాం అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి.


**నేనే ప్రత్యక్ష సాక్షిని.. నిప్పులు చెరిగిన ఖర్గే**

రాష్ట్రపతి విందుకు హాజరైన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తాజా వివాదంపై మండిపడ్డారు. తప్పుడు ప్రచారం ద్వారా రాహుల్ గాంధీ ప్రతిష్టను దెబ్బతీయాలని అధికార పార్టీ శతవిధాలా ప్రయత్నిస్తోందని, అయితే వారి కుతంత్రాలు ఎప్పటికీ ఫలించవని అన్నారు. 'రక్షణ మంత్రి (రాజ్‌నాథ్ సింగ్) కూడా గమోసా ధరించలేదు. బీజేపీ అధ్యక్షుడు (నితిన్ నబిన్) కూడా అంతే. రాహుల్ గాంధీ గమోసా వేసుకుని ఆ తర్వాత తన చేతితో పట్టుకున్నారు. అందుకు నేనే ప్రత్యక్ష సాక్షిని. బీజేపీ మాత్రం గాంధీ ఈశాన్య రాష్ట్రాలను అవమానించారంటూ ప్రచారం చేస్తున్నారు. తప్పుడు ప్రచారం ద్వారా ఆయన ప్రతిష్ట దెబ్బతీసేందు జరిగే ప్రయత్నాలు ఫలవంతం కావు' అని అన్నారు.

**వాళ్లే మాకు క్షమాపణ చెప్పాలి**

రిపబ్లిక్ డే వేడుకల్లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీకి సరైన గౌరవం ఇవ్వకుండా కేంద్రం అవమానించిందని ఖర్గే విరుచుకుపడ్డారు. ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి పిల్లల వెనుక మూడో వరుసలో రాహుల్‌ను కూర్చోబెట్టారని, కేంద్ర సహాయ మంత్రుల పక్కన కూర్చోబెట్టి తమను అవమానపరిచినందుకు వాళ్లే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## మహాత్మునికి సీఎం చంద్రబాబు ఘన నివాళి




**అమరావతి, (రాజధాని వార్తలు):** ఈ రోజు జనవరి 30 భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహాత్ముని త్యాగాలను, ఆశయాలను స్మరించుకున్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా.. బాపు దేశానికి చేసిన సేవల్ని స్మరించుకున్నారు.

**చంద్రబాబు నాయుడు నివాళి**

'జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళి అర్పిస్తున్నాను. అహింసా విధానంతో కోట్ల మంది దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపి స్వాతంత్ర్యం సాధించారు. గాంధీజీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్దాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలి. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి గాంధీజీ ఆశయాలను నిజం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేద్దాం' అని సీఎం చంద్రబాబు సోషల్ మీడియా సందేశంలో పేర్కొన్నారు.

**జాతిపితకు మంత్రి నారా లోకేశ్ నివాళి**

'సత్యం, అహింస మార్గాలనే ఆయుధంగా చేసుకుని మన దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు జాతిపిత మహాత్మా గాంధీ. జాతి సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శం. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నాను.' అని నారా లోకేశ్ తన ఎక్స్ సందేశంలో పేర్కొన్నారు.

## మై భారత్ మై వోట్









**పాలకొల్లు, (రాజధాని వార్తలు):** జాతీయ ఓటర్ల దినోత్సవం "మేరా యువ భారత్–మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్" మైభారత్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా మైభారత్ మై వోట్ అనే కార్యక్రమం ఏఎస్ఎన్ఎం గవర్నమెంట్ కాలేజ్ పటానమస్ పాలకొల్లునందు ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి మై భారత్ డిస్ట్రిక్ ఆఫీసర్ సుంకర రాము ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని జండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్ర మన ఏఎస్ఎన్ఎం కాలేజ్ నుంచి ప్రారంభమై బస్టాండ్ కూడలి మీదగా కళాశాల వరకు కొనసాగింది అనంతరం సమావేశంలో ముఖ్య అత్యధిక విచ్చేసిన వంటి సుంకర రాము మాట్లాడుతూ ఓటు యొక్క విలువను దానికున్న విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని శిథిరమైన మంచి ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవాలని ఈ హక్కును మనకు రాజ్యాంగం కల్పించిందని ఈ హక్కును సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి మాట్లాడుతూ భావితరాలకు ఓటు అనేది ఒక ఆయుధమని ఈ ఆయుధంతో మన దేశాన్ని మంచిగా నిర్మించుకునే హక్కు మనకి ఉంది అని తెలిపారు. ఇటువంటి కార్యక్రమంలో మా కళాశాల పిల్లలు పాల్గొనడం మాకు గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది అధ్యాపకులు మరియు యూత్ క్లబ్ నెంబర్స్మె భారత్ వాలంటీర్ కోసూరి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంపై ప్రభుత్వానికి సిట్ లేఖ..?

**అమరావతి, (రాజధాని వార్తలు):** తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం మరోసారి రాజకీయంగా, పరిపాలనాపరంగా వేడెక్కింది. ఈ సున్నితమైన అంశంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం సర్కార్‌కి కీలక లేఖ రాయడం ఇప్పుడు ఏపీ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**సిట్ లేఖలో కీలక అంశాలు..**

దర్యాప్తులో తేలిన ప్రాథమిక అంశాలను క్రోడీకరిస్తూ సిట్ బృందం ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఒక లేఖను సమర్పించింది. అందులో ప్రధానంగా ఈ క్రింది అంశాలను ప్రస్తావించినట్లు తెలుస్తోంది.

**జగన్ హయాంలో తప్పిదాలు..**

జగన్ హయాంలో (2019 నుంచి 2024 వరకు) టీటీడీ పరిపాలనలో, ముఖ్యంగా లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యి కొనుగోలు ప్రక్రియలో అనేక ఉల్లంఘనలు జరిగినట్లు సిట్ గుర్తించింది. లడ్డూ తయారీలో వాడిన నెయ్యి నాణ్యత లోపించిందని, అందులో కల్తీ జరిగిన మాట వాస్తవమేనని సిట్ తన నివేదికలో స్పష్టం చేసినట్లు సమాచారం.

**దిద్దుబాటు చర్యలు..**

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి టీటీడీ అనుసరించాల్సిన కఠినమైన నిబంధనలు, నాణ్యత పరీక్షల నిర్వహణపై కీలక సూచనలు చేసింది. సిట్ పంపిన సుదీర్ఘ లేఖను ప్రభుత్వం అత్యంత జాగ్రత్తగా పరిశీలిస్తోంది. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసిన తర్వాతే అధికారికంగా స్పందించాలని ముఖ్యమంత్రి కార్యాలయం భావిస్తోంది.



**వైసీపీ ప్రచారంపై ఆగ్రహం..**

సిట్ దర్యాప్తులో ఏమీ తేలలేదని, క్లీన్ చిట్ ఇచ్చేసిందని వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈ తప్పుడు ప్రచారాలు ఉన్నాయని ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై, భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది.

**భక్తుల విశ్వాసమే పరమావధి..**

ఈ వివాదంపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. తిరుమల పవిత్రతను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తోంది. కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉన్న తిరుమల లడ్డూ విషయంలో తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదు. టీటీడీ ప్రయోజనాలు, హిందూ ధర్మ పరిరక్షణే మా మొదటి ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## జర్నలిస్టుల ఫ్రీ బస్సు పాసులు ఉమ్మడి జిల్లాలకు వర్తిస్తాయి

### - జర్నలిస్టులు ఆందోళన చెందవలసిన అవసరం లేదు : ఆర్టీసీ ఈడి (ఆపరేషన్) వెల్లడి



**విజయవాడ, (రాజధాని వార్తలు):** విశాఖ జిల్లా, గాజువాక డిఎం ఆర్టీసీ అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో జర్నలిస్టుల ఫ్రీ బస్సు పాసులు ఏ జిల్లాలో ఇష్యూ అయితే ఆ జిల్లాకే వర్తిస్తాయని అనే అధికారిక మెసేజ్‌ను ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ నాయకులు ఆర్టీసీ ఈ.డి.(ఆపరేషన్) అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాక వాట్సాప్‌లో పాస్ ఇష్యూ అయినా జిల్లా సరిహద్దు దాటితే రాష్ట్ర పాసులకు 1/3 లేదా జిల్లాకు సంబంధించిన పాస్‌లు అయితే పూర్తి టికెట్‌ను ఇవ్వవలసింది ఆ వాట్సాప్‌లో డిఎం కండక్టర్లను ఆదేశించి ఉన్నారు. ఆర్టీసీ అధికారిక వాట్సాప్ మెసేజ్ ఫోటోను ఈ.డి.కి ఏ.పి.ఎం.పి.ఏ. నాయకులు ఈడికి చూపించారు. వారు వెంటనే స్పందించి ఇది కరెక్ట్ కాదు, జర్నలిస్టుల ఫ్రీ బస్సు పాసులు ఉమ్మడి జిల్లాకు చలామణి అవుతాయని ఆర్టిసి విశాఖ రీజినల్ మేనేజర్ కి ఫోన్ చేసి తెలుపుతూ జర్నలిస్టు మిత్రులతో సమస్య రాకుండా చూడవలసిందిగా ఆదేశించారు. గాజువాక డిపో వెబ్‌సైట్లో ఉన్న ఆ సమాచారాన్ని తొలగించవలసిందిగా పేర్కొన్నారు. ఇంకా విశాఖ జిల్లా పరిధిలో ఈ రకమైన సమస్యలు తలెత్తితే ఆర్టీసీ ఆర్ఎం 9959225580 లేదా డిప్యూటీ సిటిఎం 9959225582 కు ఫిర్యాదు చేయవచ్చని ఆర్టీసీ ఈ.డి. పేర్కొన్నారు. ఆర్టీసీ ఈడిని కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, నాయకులు ఆర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## నాపై దాడి ప్రయత్నం వెనుక బొత్స పాత్ర : పీలా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తనపై దాడి ప్రయత్నం వెనుక మాజీ మంత్రి, వైసీపీ నేత బొత్స సత్యనారాయణ పాత్ర ఉందని విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీరు బాగోలేదని.. ఆయన తీరును ఖండిస్తున్నానని పేర్కొన్నారు. తన మీద దాడి చేయడానికే వైసీపీ సభ్యులు కౌన్సిల్‌కు వచ్చారని తెలిపారు. తనపై ముగ్గురు వైసీపీ సభ్యులు దాడికి ప్రయత్నం చేశారని.. అందుకే వారిని సస్పెండ్ చేశామని చెప్పుకొచ్చారు. మేయర్ పోడియం మీదకి దూకి తనపై దాడికి ప్రయత్నించారని.. దాడి చేసిన వారిలో వైసీపీ డిప్యూటీ మేయర్ సతీశ్ కూడా ఉన్నారని తెలిపారు. తనపై దాడి ప్రయత్నం వెనుక బొత్స పాత్ర ఉందని భావిస్తున్నానని చెప్పుకొచ్చారు. బొత్సకు జీవీఎంసీ కౌన్సిల్‌లో సభ్యత్వం లేదని అన్నారు. వైసీపీ వాళ్లు మేయరైన తనను టార్గెట్ చేశారన్నారు. వారు టార్గెట్ చేయాల్సింది



సబ్జెక్టును అని హితవు పలికారు. గీతం భూముల విషయంలో కౌన్సిల్ తప్పు చేయలేదని పీలా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

## అందరికీ అక్రిడిటేషన్లు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఐ & పిఆర్ ఏపి, ప్రధాన కార్యాలయం పరిశీలించిన కొన్ని వార్తాపత్రికలు, పీరియాడికల్స్ విషయంలో ఎస్ఎంఏసి (29-01-2026) జరిగిన సమావేశంలో ఎస్ఎంఏసి కమిటీ విభేదించినట్లు దృష్టికి వచ్చింది. అయితే, ఐ & పిఆర్ శాఖ పరిశీలించిన మిగిలిన అన్ని వార్తాపత్రికలు, పీరియాడికల్స్‌ను ఎస్ఎంఏసి ఆమోదించింది. కాబట్టి, వీరికి సంబంధించిన అక్రిడిటేషన్ కార్డులు త్వరలో (కొద్ది రోజుల్లో) వస్తాయని తెలిసింది.

# బార్లకు రీ నోటిఫికేషన్

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం బార్లకు రీ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగినది ఇందులో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎనిమిది బార్లు నకు ఒక్కొక్క బారు 55 లక్షలు చొప్పున, బొబ్బిలి మున్సిపాలిటీలో ఒక బారునకు 55 లక్షలు చొప్పున మరియు రాజాం నగర పంచాయతీలో రెండు బార్లు ఒక్కొక్క బారుకునకు 35 లక్షలు చొప్పున కేటాయించబడింది. అలాగే పార్వతీపురం మన్యం జిల్లాలో పార్వతీపురం మున్సిపాలిటీలో మూడు బార్లు ఒక్కొక్క బారునకు 55 లక్షలు చొప్పున మరియు సాలూరు మున్సిపాలిటీలో ఒక బారునకు 35 లక్షలు చొప్పున కేటాయించబడింది. దరఖాస్తులు స్వీకరణ చివరి తేదీ 04.02.2026 జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయలలో సాయంత్రం 6 గంటల వరకు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్లో దరఖాస్తులు స్వీకరించబడతాయి. తేదీ 05.02.2026 విజయనగరం మరియు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో ఆయా జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయబడతాయి అని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీ బమ్మిడి శ్రీనాథుడు ప్రకటనలో తెలిపినారు.

మరిన్ని వివరాలు కొరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్, విజయనగరం 9440902362, అసిస్టెంట్ ప్రొహి బిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, విజయనగరం 9440902361, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, విజయనగరం 9440902360 సంప్రదించవచ్చు.

# ఫిబ్రవరి 1న వందేమాతరం పై ప్రత్యేక కార్యక్రమం



**విజయనగరం, (రాజధాని వార్తలు):** వందేమాతరం గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సంస్కార భారతి విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో విజ్ఞాన భారతి పాఠశాలలో వందేమాతరం గేయం పూర్తి గీతాలాపన ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు సంస్థ జిల్లా శాఖ అధ్యక్షురాలు చివుకుల శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు పాఠశాల ప్రిన్సిపాల్ విమల జ్యోతి ప్రజ్వలనంతో కార్యక్రమం ప్రారంభించబడి వివిధ పాఠశాలల నుండి వందేమాతరం పై పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల పాఠశాల కరస్పాండెంట్ జిబిపాఠశాల కరస్పాండెంట్ జిబిఆర్ రాజు ప్రధాన వక్తగా వ్యవహరిస్తారని, పోటీలలో విజేతలకు ముఖ్యఅతిథి తెలుగు భాషా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ బహుమతి ప్రదానం గావిస్తారని చివుకుల శ్రీలక్ష్మి పేర్కొన్నారు.

# భద్రాచలంలో మొదలైన మండల స్థాయి సీఎం కప్పు క్రీడా పోటీలు

### - క్రీడలను ప్రారంభించిన సర్పంచ్ పూనం కృష్ణ, ఎంఈఓ టి.రమ, ఎంపీడీవో శ్రీనివాస్






**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాచలం మండలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మండల స్థాయి సీఎం కప్పు క్రీడా పోటీల ఎంపిక ప్రక్రియను మండల విద్యాశాఖ అధికారి తోటమల్ల రమ అధ్యక్షతన భద్రాచలం గ్రామ పంచాయతీ సర్పంచ్ పునేం కృష్ణ ప్రారంభించినారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడల్లో స్నేహపూర్వక పోటీలు నిర్వహించినారు. సీఎం కప్పు క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలని, క్రీడలు స్నేహ భావాన్ని చెడు వ్యసనాలను దూరంగా ఉంచేందుకు దోహదపడతాయని చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, తహశీల్దార్, రాజశ్రీనివాస్, వార్డు మెంబర్లు, క్లస్టర్ ఇంచార్జ్ రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# సీతంలో ఘనంగా మెరిట్ స్కాలర్షిప్స్ ప్రదానోత్సవం







**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో బొత్స గురునాయుడు మరియు మజ్జి రామారావు మెమోరియల్ మెరిట్ స్కాలర్షిప్స్ ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్, మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే ఈ మెరిట్ స్కాలర్?షిప్?ల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని తెలిపారు. మా మామయ్య మరియు నాన్న గార్ల జ్ఞాపకార్థం కళాశాల స్థాపించినప్పటినుంచి మెరిట్ స్కాలర్షిప్స్ ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ఇటువంటి ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి భవిష్యత్ విజయాలకు బాటలు వేస్తాయని అభిప్రాయపడ్డారు. కళాశాలలో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మొత్తం 30 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమంలో రూ. 5,00,000/- నగదును అందజేశారు, మెడల్ మరియు ప్రశంసా పత్రం కూడా అందజేశారు. అవార్డులు అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఈ గౌరవం మరింత శ్రమించి మంచి ఫలితాలు సాధించేందుకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీ బొత్స చైతన్య బాబు మాట్లాడుతూ ఈ ప్రోత్సాహకాలు విద్యార్థులలో పోటీ తత్వాన్ని పెంచి వారు మరింత అభివృద్ధి చెందడానికి ఉపయోగపడతాయని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి.రామమూర్తి మాట్లాడుతూ ఈ మెరిట్ స్కాలర్షిప్స్ బొత్స గురు నాయుడు ఎడ్యుకేషనల్ సొసైటీ, అనూష ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త సహకారంతో నిర్వహించామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల గౌరవాన్ని తెలియజేసే ఆటపాటలతో విద్యార్థులు ఉత్సాహంగా అలరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మ.. మ.. అనిపిస్తే ఎలా?

### - విశాఖ ఉత్సవ్ పడవల పోటీ ఏర్పాట్లపై గంటా అసహనం

### - అధికారుల తీరు సరి కాదన్న జిల్లా కలెక్టర్



**భీమిలి, (రాజధాని వార్తలు):** విశాఖ ఉత్సవ్ ఏర్పాట్లు మ.. మ.. అనిపించేలా మొక్కుబడి తంతుగా ఉన్నాయని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మంగమారిపేటలో గురువారం పడవల పోటీలను ప్రారంభించడానికి వచ్చిన ఆయన అక్కడ కనీస ఏర్పాట్లు లేకపోవడాన్ని చూసి అవాక్కయ్యారు. ఎలాంటి ప్రచారం లేకుండా.. జనం లేకుండా.. ఎవరి కోసం ఈ కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు సంబంధించిన విశాఖ ఉత్సవ్ నిర్వహణను ఇలా చేసి.. ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారని ఫిషరీస్ జేడీ లక్ష్మణరావును నిలదీశారు. పడవలను ఏర్పాటు చేయాలని మాత్రమే తనకు చెప్పారని.. మిగిలిన ఏర్పాట్లు జిల్లా టూరిజం అధికారి మాధవి, స్పోర్ట్స్ అధికారి జూన్ గాలియట్ చేయాల్సి ఉందన్నట్టుగా లక్ష్మణరావు ఎమ్మెల్యేకు వివరణ ఇచ్చారు. ఈ దశలో జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ కలుగజేసుకుని పడవల పోటీలకు నోడల్ అధికారిగా నియమించినందున మొత్తం బాధ్యత మీదేనని లక్ష్మణరావుకు స్పష్టం చేశారు. పడవల పోటీల గురించి ఎలాంటి ప్రచారం లేకపోవడంతో స్థానికులు సైతం ఎవరూ రాలేదు. అయితే ఎమ్మెల్యే వచ్చిన విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పోటీల దగ్గరకు వచ్చారు. అనంతరం జెండా ఊపి పడవ పోటీలను గంటా ప్రారంభించారు. ఇందులో 15 మెకనైజ్డ్ పడవలు, 15 సంప్రదాయ పడవలు పోటీల్లో పాల్గొనగా.. విజేతలకు నగదు బహుమతులు ప్రకటించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, పోతిన అప్పలరాజు, కారి అప్పారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి వాసి నిమ్మకాయల భాస్కర్‌కు ఎన్‌సీసీలో పదోన్నతి






**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** భీమునిపట్నానికి చెందిన నిమ్మకాయల భాస్కర్‌కు ఎన్‌సీసీలో థర్డ్ ఆఫీసర్ స్థాయి నుంచి సెకండ్ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. బెతనీ స్కూల్‌లో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాంక్ సెరిమనీలో కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ నిరాజ్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్ కలిసి నిమ్మకాయల భాస్కర్ భుజాలపై షోల్డర్ స్టార్స్‌ను అధికారికంగా ధరింపజేశారు. సైనిక సంప్రదాయాలకు అనుగుణంగా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఎన్‌సీసీ కేడెట్లకు క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు అలవర్చడంలో నిమ్మకాయల భాస్కర్ అంకితభావంతో సేవలు అందిస్తున్నారు అని ఆయన సేవలకు గుర్తింపుగా ఈ పదోన్నతి లభించడం విశేషంగా నిలిచిందని అన్నారు. ఈ సం దర్భంగా బెతనీ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ కేడెట్లు, భీమిలి ప్రజలు మరియు శ్రేయోభిలాషులు నిమ్మకాయల భాస్కర్‌కు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయిలు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# సాఫ్ట్‌బాల్ సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరిచిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** అగనంపూడిలోని గున్న కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో జనవరి 25న నిర్వహించిన ఆంధ్రా యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ ఎంపికలలో భీమునిపట్నం ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రెండో సంవత్సరం బి.ఎస్.సి చదువుతున్న వి.శిరీష, మొదటి సంవత్సరం బి.ఎస్.సి విద్యార్థి డి.డేవిడ్ రాజు, మొదటి సంవత్సరం బి.ఏ చదువుతున్న సిహెచ్. హరి కుమార్ ఎంపికల్లో మెరుగైన ప్రదర్శన చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు పురుషుల విభాగంలో ఫిబ్రవరి 6 నుంచి 10 వరకు మహిళల విభాగంలో మహారాష్ట్ర రాష్ట్రంలోని అమరావతిలో ఉన్న సంత్ గాడ్గే బాబా అమరావతి విశ్వవిద్యాలయంలో జరిగే జాతీయ స్థాయి అంతర్ విశ్వవిద్యాలయ సాఫ్ట్?బాల్ క్రీడా పోటీల్లో పాల్గొననున్నారని కళాశాల శారీరక విద్యా సంచాలకుడు డాక్టర్ పి. గౌరీ శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి హెచ్.విష్ణు




మూర్తి, ఐక్యుఏసి సమన్వయకర్త బి. ప్రసాద రావు, కళాశాల అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా పనిచేయాలి

### - అదనపు సంచాలకులు సావిత్రి రత్నాకర్

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా సభ్యులు పనిచేయాలని డిఆర్డిఏ జిల్లా అదనపు సంచాలకులు కె.సావిత్రి, డాక్టర్ డి.రత్నాకర్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విజన్ బిల్డింగ్ పై మూడవరోజు శిక్షణ కార్యక్రమం ఏపీఎం నారాయణరావు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. వంద శాతం ఆసుపత్రిలలో కాన్పులు జరగాలని, రక్తహీనత లేని కుటుంబాలు గ్రామాల్లో కనిపించాలన్నారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వాడకం, శానిటేరీ నెపకీన్స్ వాడకంపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన కుటుంబాలు, గ్రామాలు తయారు కావాలన్నారు. ప్రతి ఒక్కరు కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకొని, తినడానికి సరిపడే ఆకు కూరలు, కాయగూరలు పండించుకోవాలన్నారు. సామాజిక భద్రత క్రింద సంఘ సభ్యులు అందరు పీఎం జెజెబివై, పీఎం ఎస్బివై




బీమా పథకాల్లో చేరే విధంగా కృషి చేయాలి అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో సమన్వయం చేసుకొని పండ్ల తోటలు పెంపకం వైపు మహిళా రైతుల దృష్టిని వెలిగించి మళ్లించి లాభదాయక మైన పంటలు పండించేటట్లు అవగాహన కల్పించి, ఆదాయం మెరుగుపరుచుకొనే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో సంస్థాగత జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.చిరంజీవి, బ్యాంకు లింకేజి డిపిఎం లక్ష్మినాయుడు, రవికుమార్, జీవనోపాధులు డిపిఎం రాజ్ కుమార్, ఫైనాన్స్ డిపిఎం సీత రామయ్య, ఏపిఎం హేమలత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగూడెం శివాలయాన్ని సందర్శించిన చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి





**ఎటపాక, (రాజధాని వార్తలు):** 2027వ సంవత్సరంలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా ఎటపాక మండలంలో పుష్కర ఘాట్ల పరిశీలనకై వచ్చిన చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శుభం నోక్వాల్‌ని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు త్రిపుర పెంటవీడు పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న ఎంతో ప్రాచీనమైన కాకతీయ రాజులు ప్రతిష్టించిన శివాలయాన్ని సందర్శించమని కోరగా వెంటనే స్పందించిన పిఓ అధికారులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ప్రాజెక్ట్ అధికారికి స్థానిక నాయకులు బాచినేని మల్లేశ్వరరావు, దుద్దుకురి సతీష్, బలుసు సునీల్, రావి విజయ్, స్థానిక మత్స్యకారులు ఆలయ ప్రాముఖ్యత గురించి మరియు గొల్లగూడెం ప్రధాన రహదారి నిర్మాణం నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేయమని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన పిఓ భక్తులు అధిక సంఖ్యలో వస్తున్న ఈ ఆలయంను అభివృద్ధి చేస్తాం అని నూతన ఘాట్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. బ్రహ్మ సూత్రం కలిగిన శివలింగానికి పిఓ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎటపాక మండల ఎమ్మార్వో మరియు ఎంపీడీవో స్థానిక నాయకులు నలజాల శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి మరియు తదితరులు ఉన్నారు.

# కరప మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్







**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్ కరప మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్ గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కరప శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే నానాజీ తనయుడు పంతం సందీప్, ముద్రగడ రమేష్, బండారు మురళి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అక్కడి నుంచి బైకులు, ట్రాక్టర్లు, కార్లతో ర్యాలీ నిర్వహించి కరప మార్కెట్ సెంటర్‌కు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీ, సందీప్, ముద్రగడ రమేష్ కేక్ కట్ చేశారు. యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు), భోగి రెడ్డి కొండబాబు, తదితర నాయకులు, కార్యకర్తలు, గజమాల వేసి అభినందనలు తెలిపారు. పెనుగుదురులో రెడ్డిపల్లి భాస్కర్ గజమాలతో సత్కరించారు. పెనుగుదురు సెంటర్‌లో జనసేన వీర మహిళలు గుబ్బల భవాని హారతులు అర్పించి ఆశీర్వదించారు. అనంతరం నడగుదురులో కరప మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్రగడ రమేష్‌ను, నూతన సభ్యులను ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రమాణ స్వీకారం చేయించారు. పంతం నానాజీ మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ రైతులకు అండగా ఉండాలని, ఆపదల్లో ముందుండి ఆదుకోవాలని, గిట్టుబాటు ధరలు వచ్చేలా చూడాలని, ప్రైవేటు దళారుల చేతిలో పడకుండా ప్రభుత్వం అందుబాటులో ఉండాలన్నారు. మార్కెట్ కమిటీలో 21 కోట్ల రూపాయల నిల్వ ఉందని, రైతులకు, రోడ్ల మరమ్మత్తులకు ఉపయోగించి సేవ చేయాలని సూచించారు. చైర్మన్ ముద్రగడ రమేష్ మాట్లాడుతూ జనసేన అధినాయకుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రబ్బర్ చెప్పులు వేసుకున్నవారిని నాయకులను చేస్తానన్నారని, ఎమ్మెల్యే పంతం నానాజీ తన్ను చైర్మన్‌గా చేయడంతో నిరూపించారని తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీకి, పవన్ కళ్యాణ్‌కి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి...!

## - అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే, డిసిసిబి చైర్మన్‌లు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అధికారులు సమన్వయంతో పనిచేసి మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, డిసి సిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు పిలుపునిచ్చారు. పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయంలో ఫిబ్రవరి 13 నుండి 18వ తేదీ వరకు జరగనున్న మహా శివరాత్రి ఉత్సవాలు నిర్వహణపై ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్‌ల ఆధ్వర్యంలో పెద్దాపురం ఆర్డీవో కె శ్రీ రమణి అధ్యక్షతన గురువారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే చినరాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లు విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివరాత్రి మహోత్సవంలో అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్ల అంశాలపై వివిధ శాఖల అధికారులతో చర్చించి వారు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా శివరాత్రి ఉత్సవాలకు లక్షలాదిగా హాజరు కానున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు సమన్వ యంతో పనిచేయాలన్నారు. స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులకు సహకరించి, ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. డిసి సిబి చైర్మన్ తుమ్మల బాబు మాట్లాడుతూ వీఐపీ దర్శనాలకు మాత్రమే ప్రాధాన్యత కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా స్వామి వారి దర్శనాలకు విచ్చేసే సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యతను కల్పించి అధికారులు ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఇంకా సమావేశంలో క్యూ లైన్‌ల ఏర్పాటు, భక్తుల పవిత్ర స్నానాలకు పుష్కరిణి, గోదావరి కాలువల ఘాట్ల వద్ద ప్రత్యేక భద్రత చర్యలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, వాలంటీర్ల సేవలు, భక్తులకు సేవా కార్యక్రమాలు ఏర్పాటు, పోలీస్ బందో బస్తు ఏర్పాటు, వాహనాల పార్కింగ్, దుకాణాల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కె చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ ఎ శ్రీ విద్య, సీఐ ఎ కృష్ణ భగవాన్, ఇరిగేషన్ జేఈ షైనీ, అగ్నిమాపక ఎస్ ఐ ప్రసాద్, కూటమి నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, అందుగుల మణి కుమారి, నూనె రామారావు, వల్లూరి దొరబాబు, పిట్టా జానకి రామారావు, అత్తిలి కృష్ణ, తుమ్మల ప్రసాద్, ముత్యం రాజబాబు, ధర్మకర్తల మండలి సభ్యులు చీమలకొండ వీరభద్ర ప్రసాద్, తాతపూడి అరుణ్ వంశీ, గోల్తి సత్యనారాయణ, కంచర్ల సుష్మా మోహిని, కొండపల్లి సత్యవాణి, మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, బిక్కిన పరమేశ్వర సాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ వివాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

## - పారదర్శకంగా రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన - క్షేత్రస్థాయి అధికారులకు బొబ్బిలిలో ప్రత్యేక శిక్షణ - తప్పులు లేని పాస్ పుస్తకాల పంపిణీయే లక్ష్యం








**బొబ్బిలి/ విజయనగరం, (రాజధాని వార్తలు):** భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి, జిల్లాను వివాదరహితంగా తీర్చిదిద్దడమే యంత్రాంగం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి స్పష్టం చేశారు. భూముల రీ-సర్వే ప్రక్రియలో దొర్లిన పొరపాట్లను సరిదిద్ది, రైతులకు భరోసా కల్పించేందుకు చేపట్టిన ప్రత్యేక కార్యాచరణలో భాగంగా గురువారం బొబ్బిలి కళాభారతిలో రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో జరిగిన సర్వే లోపాల వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను గమనంలో ఉంచుకుని, ఈసారి అత్యంత పారదర్శకంగా రికార్డులను ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. "ప్రభుత్వం మనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, రికార్డులను మనమే సరిదిద్దుకోవాలి. క్షేత్రస్థాయిలో వీఆర్వో, సర్వేయర్లు సంయుక్తంగా ప్రతి భూమిని పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి ఇ-కేవైసీ పూర్తి చేయాలి. వివరాలన్నీ నూటికి నూరు శాతం ఖచ్చితంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రింటింగ్‌కు పంపాలి" అని ఆయన తేల్చి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, రెండు దశల్లో ఇప్పటికే 499 గ్రామాల్లో రీ-సర్వే పూర్తయి, పోర్టింగ్ జరిగిన 423 గ్రామాల్లో 2.03 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ గ్రామాలకు చెందిన పాస్ పుస్తకాల్లో పెద్ద ఎత్తున తప్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. అలాగే ఆ తరువాత జరిగిన రీసర్వే లో కూడా తప్పులు జరగడం శోచనీయమని పేర్కొన్నారు. సుమారు 8,015 పాస్ పుస్తకాలకుగాను, ఇంకా 3,896 పుస్తకాలను సరిదిద్దాల్సి ఉందన్నారు. తప్పులు సరిదిద్ది ఫిబ్రవరి 10 లోగా పంపిణీ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులన్నిటినీ సరిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రస్తుతం రెవెన్యూ అధికారులపై ఉందన్నారు. ఈ ప్రక్రియను ప్రహసనంలా కాకుండా, అంకితభావంతో పూర్తి చేసి, ప్రతి నెలా 2 నుంచి 9వ తేదీ మధ్య విడతల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని పూర్తి చేయాలని సూచించారు. తప్పులు సరిదిద్దే ప్రక్రియలో పాటించాల్సిన ఆరు నిబంధనలను వివరించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను కలెక్టర్ వివరించారు. రెవెన్యూ క్లినిక్‌లకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించి ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలని కోరారు. జిల్లాలో చాలా భూ సమస్యలకు కారణమైన జాయింట్ ఎల్పీఎంలను సరిదిద్దాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ మాట్లాడుతూ, పాత పాస్ పుస్తకాల్లో దాదాపు చాలా వరకు తప్పులు ఉన్నట్లు గుర్తించామన్నారు. తొలుత డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చి, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే తుది రికార్డులు రూపొందించాలని సూచించారు. తప్పులను సరిదిద్దే అవకాశాన్ని తాజాగా ప్రభుత్వం తాసిల్దార్లకు, ఆర్డీవోలకు కల్పించిందని చెప్పారు. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను పూర్తిగా పరిశీలించి, ఖచ్చితమైన వివరాలను నమోదు చేయాలని సూచించారు. రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా వచ్చే సమస్యలను 10 రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఇచ్చే పాస్ పుస్తకాల్లో ఒక్క తప్పు కూడా దొర్లకూడదని ఆదేశించారు. రెవెన్యూ రికార్డులను సవరించే బాధ్యతను పిపిటి ద్వారా జేసి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం.రామ్మోహన్, సర్వే శాఖ ఏడి విజయ కుమార్, బొబ్బిలి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, విఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# కోవూరు తహసీల్దారు కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పరామర్శ





**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండల తహసీల్దారు సిహెచ్ సుబ్బయ్య సతీమణి చలంచర్ల స్వాతి పార్దవదేహానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పూలమాల వేసి తీవ్ర ప్రగాఢ సంతాపం తెలిపి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నెల్లూరు రూరల్ మండలం ధనలక్ష్మి పురంలోని తహసీల్దారు నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సుబ్బయ్య కుటుంబానికి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తమ ప్రగాఢ సానుభూతి తెలియచేశారు. తహసిల్దార్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, పడుగుపాడు టిడిపి ఇన్చార్జ్ జెట్టి మదన్ రెడ్డి మరియు టిడిపి నాయకులు విన్నకోట రాఖీ, టీడీపి నేతలు తదితరులు ఉన్నారు.

# పవిత్ర తిరుమల లడ్డును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్న చంద్రబాబు : జమ్మలమడక నాగమణి

**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** తిరుమల పవిత్ర లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు కలిపారని ఏపీ సీఎం చంద్రబాబు ప్రాచుర్యం చేసిన అబద్ధాన్ని సిబిఐ సిట్ పూర్తిగా ఖండించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ జంతు కొవ్వుతో లడ్డును అపవిత్రం చేశారన్న చంద్రబాబు వ్యాఖ్యలు అసత్యం, నిరాధారం అని దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థ తేల్చింది. దీంతో ఆయన కుటిల రాజకీయ నాటకం మరోసారి బట్టబయలైంది" అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలు వ్యవహరించడం ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు వ్యాఖ్యలతో ఆ రోజునుంచి నేటివరకూ టిడిపి అనుకూల మీడియా, కొంతమంది స్వామిజీలు కూడా మాజీ సీఎం వైఎస్ జగన్‌పై నిరాధార ప్రచారం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశంపై పవన్ కళ్యాణ్ పాచిపోయిన లడ్డూలు అంటూ చేసిన వ్యాఖ్యను స్మరింపజేస్తూ అన్ని లడ్డూలు ఒకేలా ఉండవు. కానీ తిరుమల లడ్డూ మాత్రం మహాప్రసాదం దానిపై రాజకీయాలు చేయడం పాపం అని ఆమె మండిపడ్డారు. తిరుమల మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ ఆనాటి ఫోటోషూట్‌ను కూడా ఆమె ఉదహరిస్తూ, రాజకీయ వినియోగం కోసం పవిత్రతను అపహాస్యం చేశారని విమర్శించారు. జగన్, వైవి సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డిలపై చేసిన అసత్య ఆరోపణలు, దుష్ప్రచారాలు ఇప్పుడు పూర్తిగా కొట్టివేయబడ్డాయని చెప్పారు. కిరాక్ ఆర్పి వంటి నీచమైన పెయిడ్ ఆర్టిస్టులు కూడా లడ్డు అంశంపై లేని రాద్ధాంతం సృష్టించారని ఆమె ధ్వజమెత్తారు. చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలను ఖండిస్తూ అప్పుడే వైవి సుబ్బారెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించారని, కోర్టు వ్యాఖ్యలు చంద్రబాబుకే చెంపపెట్టు చేశాయని ఆమె వ్యాఖ్యానించారు. సిబిఐ సిట్ ఫైనల్ ఛార్జ్‌షీట్‌లో కూడా చంద్రబాబు అనుచరులు చేసిన లడ్డు అసత్యప్రచారం పూర్తిగా తప్పని తేలిందని తెలిపారు. రాజకీయ లాభం కోసం దేవుళ్లను కూడా వదలని చంద్రబాబు ఇప్పటికైనా ప్రాయశ్చిత్తంగా ప్రజల ముందుకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నెయ్యి సరఫరాలో కల్తీ వ్యవహారానికి తెరతీసింది చంద్రబాబు ప్రభుత్వమేనని, 2019 ఫిబ్రవరి 18న 94 వేల కేజీల నెయ్యిని కిలో రూ.291కు కొనుగోలు చేసిన దాఖలాలు ఉన్నాయని, అప్పట్లో హర్ష డైరీగా ఉన్న ఆ సంస్థ ఇప్పుడు భోలే బాబా డైరీ పేరుతో పని చేస్తోందని వివరించారు. ఆ డైరీ నుంచి వచ్చే నాణ్య తలేని నెయ్యిని 2022లోనే జగన్ ప్రభుత్వం బ్లాక్‌లిస్ట్ చేసిందని జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఒకే ఒక్కడు.. 'మిస్టర్ బీబీసీ'!

మన కళ్లను టీవీ స్క్రీన్‌కు, మన చెవులను మొబైల్ ఫోన్‌కు అప్పగించని కాలంలో వినవ్రు రేడియో ఉండేది. 1960ల బంగారు బాల్యాన్ని దాటి 1970ల్లో కౌమార దశ, తొలి యవ్వనంలో ప్రస్థానించినవారు రేడియో అనే గవాక్షం ద్వారా విశాల ప్రపంచాన్ని వీక్షించేవారు, వినేవారు. నా జీవన విశ్వానికీ రేడియోనే కేంద్రం. వీనుల విందు చేసే హిందీ సినిమా పాటలను మన రేడియో (ఆకాశవాణి) వివిధ భారతి కార్యక్రమం ప్రతి రోజూ ప్రసారం చేసేది. వాటిని విన్న క్షణాలు నాకు ఇప్పటికీ సుమధుర జ్ఞాపకాలే. ఆదివారం మధ్యాహ్నం అమీన్ సయానీ అద్భుతంగా నిర్వహించే బోర్నవిటా క్విజ్ కార్యక్రమాన్ని వింటూ నేను స్వాయత్తం చేసుకున్న ఆనందం ఎనలేనది. 1975లో హాకీ వరల్డ్ కప్‌ను భారత్ గెలుచుకున్నప్పుడు జస్దేవ్ సింగ్ దేశభక్తి ప్రపూరిత భావోద్విగ్న వ్యాఖ్యానాన్ని నేను నా గుండెలో నింపుకున్నాను, నిలుపుకున్నాను. ఆ రోజుల్లోనే తాజా క్రికెట్ స్కోర్ తెలుసుకునేందుకు క్లాస్‌రూమ్‌లోనే నా పాకెట్ ట్రాన్సిస్టర్‌ను వింటూ ఉండేవాణ్ణి! బీబీసీ రేడియో ప్రసారాలు వినడమూ ఆ రోజుల్లోనే నాకు అలవాటయింది. పోలీసు అధికారి అయిన మా తాతయ్య ప్రతి ఉదయమూ యోగాసనాలూ, ధ్యానం అనంతరం బీబీసీ న్యూస్ బులెటిన్ తప్పక వినేవారు. 'వార్తలు వినదలుచుకున్నప్పుడు బీబీసీనే విను' అని ఆయన నాకు చెబుతుండేవారు. ఆయన సూచన మేరకు బీబీసీ న్యూస్ వినడం నాకు ఒక వ్యసనమయింది. నాకేనా? నాలాంటి ఎంతో మందికి కూడా. ఇలా ఎందరినో బీబీసీకి అభిమానులుగా మార్చిన ఆ ఘనతను సాధించిపెట్టిన ఒకే ఒక్కడు మార్క్ టలీ (తదనంతర కాలంలో సర్ మార్క్ టలీ). 1984లో ఇందిరాగాంధీ హత్యకు గురయ్యారన్న వార్తను అందరి కంటే ముందుగా ప్రపంచానికి బీబీసీ తెలియజేసినప్పుడు నేను హెయిర్ సెలూన్‌లో ఉన్నాను. ఆకాశవాణి విషాద సంగీతాన్ని వినిపిస్తోంది. అయితే ఆ భయానక ఘటన గురించి టలీ అనర్గళమైన స్వరంతో వార్తా నివేదన చేసిన తరువాతే ఆ దుర్వార్తను ధ్రువీకరించుకున్నాను. 1992లో బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు నేను ముంబైలో విలేఖరిగా ఉన్నాను. సంఘటన ప్రదేశం నుంచి విశ్వసనీయమైన వార్తా కథనాన్ని వినేందుకు అప్పుడూ నేను విన్నది బీబీసీనే. అయోధ్యలో కరసేవకులు టలీని వెన్నాడి, చంపేస్తామని బెదిరించారు. అయినా సంభవించిన ఘటన క్రమాన్ని ఆయన సంయమనంతో తేటతెల్లంగా విశదం చేశారు. మార్క్ టలీది విశ్వసనీయమైన వాణి. ఆయన స్వరంలో నిష్పాక్షికత భావోద్వేగ ప్రామాణికతతో మిళితమవుతుంది. సువిశాల భారతదేశంలో విస్తృతంగా పర్యటించి, అన్ని మతాల వారు, భాషల వారితో మనసు విప్పి మాట్లాడడం ద్వారా ఆయన తన వాణికి ఒక విశిష్టతను సముపార్జించుకున్నారు. ఆయన వార్తలు, వ్యాఖ్యానాలు శ్రోతలను మంత్రముగ్ధులను చేసేవి. వాటిని వారెవ్వరూ మరచిపోలేరు. దశాబ్దాల పాటు బీబీసీ ఇండియా బ్యూరో చీఫ్‌గా పనిచేసిన టలీ, ఆ సంస్థను సమస్త భారతీయులకు సుపరిచితమైన, విశ్వసనీయమైన న్యూస్ బ్రాండ్‌గా మార్చివేశారు. 1990ల్లో నా కెమెరామ్యాన్‌తో కలిసి ఉత్తరప్రదేశ్‌లో పర్యటిస్తున్నాను. లక్నో సమీపంలోని ఒక గ్రామానికి వెళ్లినప్పుడు మామిడి తోటల ఆసామి ఒకరు మమ్ములను తన గృహానికి ఆహ్వానించారు. అంతకుముందు కొన్ని సంవత్సరాల క్రితం మార్క్ టలీతో తాను దిగిన ఫొటోనొకదాన్ని మాకు చూపారు. 'టలీని కలవడం, ఆయనతో సంభాషించడం తనకొక చిరస్మరణీయమైన, భావోద్వేగ అనుభవం' అని ఆ మామిడి రైతు నాకు చెప్పారు. పాత్రికేయ వృత్తి నిర్వహణలో మీరు ఒక ముద్రవేయడానికి మీ గొంతు పెంచాల్సిన అవసరంలేని కాలంలో టలీ సెలెబ్రిటీగా వెలుగొందారు. పువ్వులను పుట్టించేది వర్షమే కానీ, ఉరుములు కాదు కదా. ప్రభావాన్ని నెరపేందుకు ప్రశాంతంగా, సంయమనంతో, ఆలోచనాత్మకంగా మాట్లాడితే సరిపోయిన రోజులవి. నాకూ ఈ గొప్ప పాత్రికేయుడుతో చిరస్మరణీయమైన, భావోద్వేగ అనుభవం ఉన్నది. 1994లో నేను ముంబై నుంచి ఢిల్లీకి మారాను. దేశ రాజధాని అధికార నడవాలు నాకు అపరిచిత ప్రదేశాలు. రాజకీయవేత్తలను కలుసుకోవాలనే ఆరాటం నాకు లేదు. మార్క్ టలీని కలవడానికే ప్రాధాన్యమిచ్చాను. నేను ఆయనకు ఫోన్ చేసినప్పుడు వెంటనే రమ్మని చెప్పారు. యువ పాత్రికేయులను కలవడం తనకెంతో సంతోషం కలిగించే విషయమని ఆయన అన్నారు. పటాటోపంతో వ్యవహరించే ఎడిటర్లు తమ విలేఖర్లను కలిసేందుకు తమ గదుల నుంచి బయటకు రారు కదా. మరి ఇరవైల ప్రాయంలో ఉన్న నన్ను టలీ సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో మరచిపోలేని పిచ్చాపాటీ చేశాను. పాత్రికేయంలో తన అనుభవాలను ఆయన ఆసక్తికరంగా వివరించారు. అంత గొప్ప జర్నలిస్టు వృత్తి జీవితం మొదటి దశలో ఉన్న యువ పాత్రికేయుడుతో అంత కలుపుగోలుగా మాట్లాడడం అపురూప విషయమే. తమకు అవసరమైన సమాచారం కోసం మాత్రమే భారతీయ పాత్రికేయులను కలుసుకునే 'ఫిరంగ్' తరహా జర్నలిస్టు కాదు టలీ. ఆయన తనను తాను భారతీయ పాత్రికేయ జగత్తులో అంతర్భాగంగా భావించుకునేవారు. ఈ కారణంగానే భారతదేశాన్ని తన సొంత దేశంగా మార్క్ టలీ భావించారు, గౌరవించారు. భారత్ అన్నా, భారతీయులు అన్నా ఆయనకు అవ్యాజమైన ప్రేమాభిమానాలు. అవి ఎటువంటి అభిజాత్యం లేనివి. భారత్‌ను ఒక ప్రగాఢ ఆధ్యాత్మిక ప్రదేశంగా మార్క్ టలీ భావించారు. దేవునికి అనేక మార్గాలు ఉన్నాయనే సత్యాన్ని భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల నుంచే తాను నేర్చుకున్నానని ఆయన చెప్పేవారు. 'రక్తంలోను, రంగులోను భారతీయులు; అభిరుచులు, ఆలోచనలు, అభిప్రాయాలు, మేధలో ఆంగ్లేయులు అయిన వ్యక్తులను సృష్టించే లక్ష్యంతో భారత్‌లో ఆంగ్ల మాధ్యమంలో నూతన విద్యా విధానాన్ని అమలుపరచాలని లార్డ్ మెకాలే 1835లో ప్రతిపాదించారు.

# 48 వార్డులో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులు

**- వార్డులో పలుచోట్ల నూతన డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించిన గంకల**

**- ఇందిరా నగర్ -1, లాల్ బహుదూర్ నగర్, ఏఎస్ఆర్ నగర్, రాంజీ ఎస్టేట్, జై భారత్ నగర్‌లో అభివృద్ధి పనులు పరిశీలించిన గంకల కవితా అప్పారావు యాదవ్ - వార్డు అభివృద్ధి కోసం అధికారులు చుట్టూ తిరుగుతూ వార్డును అభివృద్ధి పరుస్తున్న గంకల కవిత అప్పారావు యాదవ్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 48వ వార్డులో వార్డు ప్రజలకు 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ అభివృద్ధి పనులను నేరుగా దగ్గరుండి పర్యవేక్షణ చేస్తున్నారు. గుడ్ మార్నింగ్ గంకల పేరుతో వార్డులో సమస్యలను నేరుగా ప్రజలు వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారం చూపుతున్నారు. ఇందులో భాగంగా గురువారం వార్డులో ఇందిరా నగర్ -1, లాల్ బహుదూర్ నగర్, ఏ ఎస్ ఆర్ నగర్, రాంజీ ఎస్టేట్, జై భారత్ నగర్‌లో మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనులను నేరుగా పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పనులను పరిశీ లించి అధికారులకు కాంట్రాక్టర్‌కు నాణ్యతలో లోపం లేకుండా నిర్మాణ పనులు చేయాలని సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభివృద్ధి పనులను పరిశీలించారు. వార్డులో అధికారులు, ప్రజలతో కలిసి పరుగులు పెడుతూ అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ పర్యటనలో జై భారత్ నగర్‌లో గెడ్డలో చెత్త పేరుకుపోవడం గమనించి పారిశుధ్య కార్మికులతో గెడ్డలో పేరుకుపోయిన పూడికలు తొలగింపు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48వ వార్డులో చేపడుతున్న గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలించి జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి జీవీఎంసీ మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వార్డు ప్రజల సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా వార్డులో గల ఇందిరా నగర్ -1, లాల్ బహుదూర్ నగర్, ఏ ఎస్ ఆర్ నగర్, రాంజీ ఎస్టేట్, జై భారత్ నగర్‌లో మెయిన్ డ్రైనేజీ నిర్మాణ పనుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. జై భారత్ నగర్‌లో గెడ్డలో చెత్త పేరుకుపోవడం గమనించి పారిశుధ్య కార్మికులతో గెడ్డలో పేరుకుపోయిన పూడికలు తొలగింపు పనులు చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గంకల కవితా అప్పారావు యాదవ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా వార్డు అంతటా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రజల నుంచి పలు వినతలను స్వీకరించి తక్షణమే ఫోన్‌లో అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు. వార్డు అభివృద్ధికు నిరంతరం అహర్నిశలు కృషి చేస్తున్న కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు యాదవ్‌కు వార్డు ప్రజలు హర్షధ్వనులు తెలిపారు.

# ఏపీపీఏపీ సంఘం విశాఖ జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు

**- జిల్లా అధ్యక్షులుగా అంబటిపూడి సుధీర్, జిల్లా కార్యదర్శిగా మావూడూరు సంపత్ కుమార్**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అర్చక పురోహిత సంఘం విశాఖ జిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏర్పాటు అయ్యింది. రాష్ట్ర కార్యదర్శి అధికారుల కాళీదాస్ చేతులు మీదగా నూతనంగా ఎన్నిక అయ్యిన కార్యవర్గ సభ్యులుకు నియామకం పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా కార్యవర్గ సభ్యులుకు తమకు ఇచ్చిన పదవిని చక్కగా నిర్వర్తించమని చెప్పడం జరిగింది. జిల్లా అధ్యక్షులు సుధీర్ కుమార్ శర్మ మాట్లాడుతూ మన సంఘం మరింత బలోపేతం చేస్తూ మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వ హిస్తూ సంఘంకు పేరు ప్రాఖ్యాతలు తీసుకురావాలని అన్నారు జిల్లా కార్యదర్శి సంపత్ కుమార్ శర్మ మాట్లాడుతూ మన సంఘం అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేసి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధ్యక్షులు సుధీర్ కుమార్ శర్మ మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యుల వివరాలును సభాముఖంగా తెలియజేసారు. గౌరవ అధ్యక్షులుగా బ్రహ్మశ్రీ రావూరి సుబ్రహ్మణ్యం,అధికార ప్రతినిధిగా భోగాపురపు కార్తికేయ శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బ్రహ్మశ్రీ రాంబిల్లి బుచ్చి భాస్కర కుమార్ శర్మ, బ్రహ్మశ్రీ పట్నాల ప్రసాద్,విశాఖ జిల్లా అధ్యక్షులుగా బ్రహ్మశ్రీ అంబటి పూడి సుధీర్ కుమార్ ఉపాధ్యక్షులుగా ఇప్పిలి రామకృష్ణ, లింగం కామేశ్వర రావు, మంగిపుడి సుబ్రహ్మణ్యం, జిల్లా కార్యదర్శి బ్రహ్మశ్రీ మావూడురు సంపత్, ఉప కార్యదర్శులుగా ఎర్ర గుంట్ల సంపత్ కుమార్, ఏడిద గురునాథ పెంట వేంకట రమణ, పప్పు సాయి గణేష్ కోశాధికారిగా బ్రహ్మశ్రీ మురపాక అనిలకుమార్ ఉప కోశాధికారిగా మేడూరి శ్రీనివాస్, మీడియా ఇంచార్జ్‌లుగా గరిమెళ్ళ శ్రీకాంత్, మావూడూరు ఉదయ్, సోషల్ మీడియా ఇంచార్జ్‌గా ప్రవీణ్ నంబూద్రి, ఇంచార్జ హెడ్ ముడియా నరసింహమూర్తి, కమిటీ మీటింగ్ ఆర్గనైజేషన్‌గా గంటి కిరణ్ కమిటీ సభ్యులు 11 మంది బూరెల నరసింహ, రామాయణం మారుతీ ప్రసాద్, ఆంధ్ర శేషాద్రి, కొట్ర లక్ష్మి నారాయణ నియమితులయ్యారని అయిన వివరించారు వీరందరికి రాష్ట్ర కార్యదర్శి అధికారుల కాళిదాస్ నియామక పత్రాలు ఇచ్చి అందరికి శుభాభినందనలు తెలిపారు.

# చేసేది హోంగార్డు ఉద్యోగం ఆస్తులు మాత్రం రూ.20 కోట్లు

**- ఎలా సంపాదించాడో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** చేసేది హోంగార్డు ఉద్యోగం కానీ ఆస్తులు చూస్తే మాత్రం బిత్తరపోవాల్సిందే15 ఏళ్లుగా హోంగార్డుగా చేసే వ్యక్తి సాధారణంగా కుటుంబం నెట్టుకు రావడానికే ఆపసోపాలు పడతారు అలాంటిది ఒక సాధారణ హోంగార్డు రూ.20 కోట్ల రూపాయల ఆస్తులు సంపాదించడం చర్చాంశ నీయాంశంగా మారింది. సదరు హోంగార్డుపై గతంలో అనేవక అవినీతి ఆరోపణలు సైత వెల్లువెత్తాయి. ఈ క్రమంలో ఏడాది క్రితం సదరు హోంగార్డును జిల్లా పోలీస్ కార్యాలయానికి ఏసీబీ సరెండర్ చేసింది. ఏసీబీలో ఉంటూ అవినీతి అధికారులకు సమాచారం ఇచ్చి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నట్లు ఏసీబీకి ఫిర్యాదు రావడంతో రంగంలోకి దిగిన ఏసీబీ ఏకకాలంలో అతడి ఇంట్లో బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించగా రూ.20 కోట్ల మేర ఆస్తులు సంపాదించినట్లు తెలుస్తోంది. ఇంతకీ ఈ అవినీతి తిమింగలం ఎవరు? ఇన్ని ఆస్తులు ఎలా సంపాదించారు. ప్రస్తుతం ఎక్కడ పని చేస్తున్నాడు?

**హోంగార్డు నెట్టి శ్రీనివాసరావుపై ఏసీబీ సోదాలు**

విజయనగరంలోని గోకపేటలో హోంగార్డు నెట్టి. శ్రీనివాసరావు ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు ఒక్కసారిగా కలకలం రేపాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్న శ్రీనివాస రావుపై ఏసీబీకి ఫిర్యాదు అందింది దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఏకకాలంలో నాలుగు చోట్ల సోదాలు నిర్వహించారు విజయనగరం గోకపేటలోని నివాసంతో పాటు గుర్లమండలం నడుకూరి గ్రామం, విశాఖపట్నం లోని బంధువుల ఇంట్లో సోదాలు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారంటూ వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో భాగంగా పలు ఆస్తులకు సంబంధించి కీలక డాక్యు మెంట్లును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**రూ.20 కోట్ల మేర అక్రమ ఆస్తులు?**

హోంగార్డు నెట్టి శ్రీనివాసరావు రూ.20 కోట్ల మేర అక్రమ ఆస్తులు సంపాదించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 15 ఏళ్లుగా నెట్టి. శ్రీనివాస రావు హోంగార్డుగా పని చేస్తున్నారు. అయితే గతంలో పలు ప్రాంతాలలో పనిచేసి నప్పుడు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి దీంతో ఆయనను ఎస్పీ కార్యాలయానికి సరెండర్ చేశారు. ప్రస్తుతం జిల్లా ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా పనిచేస్తున్నారు ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయనే సమాచారంతో ఈ సోదాలు నిర్వహించారు అయితే ఒక సాధారణ హోంగార్డు రూ.20 కోట్లు ఎలా సంపాదించారు అనేదానిపై చర్చ జరుగుతుంది గతంలో ఏసీబీ హోం గార్డుగా పనిచేస్తున్న సమయంలో రైడ్ గురించి తెలుసుకుని వారికి ముందే సమాచారం అందించి భారీ మొత్తంలో ఆస్తులు కూడబెట్టారనే ప్రచారం జరుగుతుంది. ఇలా రూ.20 కోట్ల వరకు సంపాదించారని తెలుస్తోంది అంటే తిన్నింటి వాసాలు లెక్కపెట్టి భారీ మట్టత్తంలో ఆస్తులు కూడా బెట్టారని తెలుస్తోంది దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

# బాలికలు, బాలురతో సమానంగా అన్ని రంగాల్లో ప్రగతిని సాధించాలి




**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం మామండూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ జయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదువులు చదువుకున్నప్పుడే బాలురతో సమానంగా అభివృద్ధి సాధిస్తారని తెలి పారు. అనంతరం గ్రామంలో జరిగిన సమావేశంలో తల్లిదండ్రులు సమావేశం నిర్వహించి బాలికలకు 18 సంవత్సరాలు బాలురకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలని బాలికలు బాగా చదువుకుని ఒక స్థాయిలో అభివృద్ధి సాధించినప్పుడే స్థిర పడినప్పుడే వివాహాలు చేసుకోవాలని కోరారు. సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని వీరిని ప్రోత్సహించే బాధ్యత సమాజంపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు మనోహర్, అంగన్వాడి టీచర్ మాధవి, ఆశ వర్కర్ సుగుణ, తల్లిదండ్రులు కమ్యూనిటీ లీడర్లు, ఎస్సీబీ లీడర్లు ప్రగతి సంస్థ సిబ్బంది సురేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# తిరుమల పవిత్రతను కల్తీ నెయ్యితో అపవిత్రం చేశారు



**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** సూళ్లూ రుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మరియు మాజీ ఎం.పీ. నెలవల సుబ్రహ్మణ్యం గత వైసిపి ప్రభుత్వంలో తిరుమలలో కల్తీ నెయ్యితో అపవిత్రం చేశారని విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా కల్తీ నెయ్యి వ్యవహారం బయట పెట్టింది. దానిని సుప్రీం కోర్ట్ ఈరోజు అసలు పాలతో సంబంధం లేకుండా మొత్తం రసాయనాలతో కూడిన నెయ్యినే వాడారని నిరూపించింది. హిందువులు ఆరాధ్య దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని ఎంతో పవిత్రంగా భావిస్తారు, అలాంటి పవిత్రమైన పుణ్యక్షేత్రంలో తయారయ్యే లడ్డును అంతే పవిత్రంగా భావిస్తారు. అలాంటి లడ్డూలు తయారీకి ఉపయోగించే నెయ్యిని కొనుగోలు చేయాలంటే అనుభవము ప్రమాణాలు పరిగణలోకి తీసుకొని అనుమతులు ఇవ్వాలి, అలాంటివి ఏమీ లేకుండా అనుభవం లేని, ప్రమాణాలను పాటించని, కంపెనీలకు అనుమతులు ఇచ్చి శ్రీవారి సొమ్ము దాదాపు 235 కోట్లను దోచుకున్నారు. గత ముఖ్యమంత్రికి హిందువులంటే నచ్చదు తిరుమల పవిత్రతను అడుగడుగునా అపవిత్రం చేశారు. శ్రీవారికి పెట్టే పట్టు వస్త్రాల విషయంలో దంపతులు కలిసి పెట్టాల్సిన పట్టు వస్త్రాలను ఒక్కడే వచ్చి సమర్పించడం జరిగేది. పరకామణిలో దొంగతనం చేసిన వాళ్లను సపోర్ట్ చేశారు. వాళ్లు చేసిన పాపాలకు దేవుడు 155 సీట్లు ఉన్న వారిని 11 సీట్లకు పరిమితం చేశాడు. ఇకనైనా వాళ్ల తప్పును తెలుసుకొని దేవుడి దగ్గర ఒప్పుకుంటే దేవుడు క్షమిస్తాడని లేకుంటే అధః పాతాళానికి తొక్కేస్తాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సార్వత్రిక సమ్మెకు సహకరించాలి : సి.ఐ.టి.యు నాయకులు

**గూడూరు, (రాజధాని వార్తలు):** గత ప్రభుత్వము అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఫిబ్రవరి 12వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సహకరించాలని ఐసిడిఎస్ సిడిపిఓ మెహబూబికి ఏ.పి. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సి.ఐ.టి.యు) అనుబంధం ఆధ్వర్యంలో అంగన్వాడి అధ్యక్ష, కార్యదర్శులు, ఏ.ఇంద్రావతి, బి.ఎస్.ప్రభావతి సెక్టార్ లీడర్లు, ఇ.పెంచలమ్మ, ఎస్.లక్ష్మి, బి.మంగమ్మలు పాల్గొని సమ్మె నోటీసు అందజేయడం జరిగింది. అనంతరం గూడూరు సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య మాట్లాడుతూ 4 కార్మిక కోడ్లను వాటి నియమాలను రద్దు చేయాలని, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు మినీ లను కార్మికులుగా గుర్తించి ట్రేడ్ యూనియన్ హక్కులు కల్పించా లని, అంగన్వాడీలకు రూ. 26,000/-లు, కనీస వేతనాలు, 10,000 పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునివ్వడం జరిగింది. అదేవిధంగా గూడూరు హెడ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయ పోస్ట్ మాస్టర్ ఎస్.కె.నజీముద్దీన్, కె.చంద్రశేఖర్ డివిజనల్ కార్యదర్శిలకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ నోటీసు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ సి.ఐ.టి.యు నాయకులు బి.వి. రమణయ్య, జోగి. శివకుమార్, భూలోక మురళి, తదితరులు పాల్గొన్నారు.

# అనిల్ రావిపూడి నెక్ట్స్.. మరో బిగ్ ట్విస్ట్!



టాలీవుడ్‌లో వరుస హిట్స్‌తో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి ఇప్పుడు మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్‌గా మారిపోయారు. గత ఏడాది సంక్రాంతికి వెంకటేష్‌తో 'సంక్రాంతికి వస్తున్నాం' అంటూ వచ్చి బ్లాక్ బస్టర్ కొట్టిన అనిల్, ఈ ఏడాది సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవితో 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాతో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశారు. వరుసగా ఇద్దరు సీనియర్ హీరోలకు సాలిడ్ సక్సెస్ ఇవ్వడంతో అనిల్ నెక్ట్స్ ప్రాజెక్ట్ ఎవరితో ఉండబోతోందనే చర్చ ఫిల్మ్ నగర్‌లో జోరుగా సాగుతోంది. సాధారణంగా అనిల్ రావిపూడి తన సినిమాల్లో కామెడీతో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ పక్కాగా ఉండేలా చూసుకుంటారు. అయితే ఈసారి అనిల్ తన పంథా మార్చి ఒక డిఫరెంట్ అప్రోచ్‌తో వెళ్తున్నట్లు తెలుస్తోంది. నెక్ట్స్ మూవీ హీరో ఎవరనేది ఇప్పటి వరకు అఫీషియల్‌గా కన్ఫర్మ్ చేయకపోయినా, విక్టరీ వెంకటేష్‌తోనే అనిల్ మరో సినిమా చేయబోతున్నట్లు గట్టిగా వినిపిస్తోంది.


వీరిద్దరి కాంబోలో వచ్చే సినిమాలు ఫ్యామిలీ ఆడియన్స్‌కు బాగా కనెక్ట్ అవుతాయి కాబట్టి, ఈ హ్యాట్రిక్ ప్రాజెక్ట్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు ఒక ఇంట్రెస్టింగ్ లీక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వెంకటేష్‌ను ఢీకొట్టే పవర్ ఫుల్ విలన్ పాత్ర కోసం మలయాళ స్టార్ నటుడు ఫాహద్ ఫాసిల్‌ను అనిల్ రావిపూడి లాక్ చేసినట్లు సమాచారం. ఫాహద్ పెర్ఫార్మెన్స్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు, 'పుష్ప' సినిమాలో భన్వర్ సింగ్ షెకావత్‌గా ఆయన చూపించిన ఇంపాక్ట్ మామూలుగా లేదు. ఇప్పుడు అనిల్ మార్క్ కమర్షియల్ డ్రామాలో వెంకీకి ఆపోజిట్‌గా ఫాహద్ కనిపిస్తే ఆ గొడవ వేరే లెవల్‌లో ఉంటుందని నెటిజన్లు భావిస్తున్నారు. అనిల్ రావిపూడి రీసెంట్‌గా ఫాహద్ ఫాసిల్‌ను కలిసి కథ వినిపించారని, ఆ క్యారెక్టర్‌లో ఉన్న వేరియేషన్స్ నచ్చి ఆయన వెంటనే ఓకే చెప్పారని టాక్. సాధారణంగా అనిల్ సినిమాల్లో విలన్ పాత్రలు కూడా కాస్త ఎంటర్టైనింగ్‌గా ఉంటాయి. కానీ ఈసారి వెంకటేష్ కోసం ఒక సీరియస్ క్రైమ్ లేదా ఇంటెన్స్ డ్రామాను అనిల్ ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఫాహద్ లాంటి వెర్సటైల్ నటుడు ఉంటేనే ఆ పాత్రకు న్యాయం జరుగుతుందని అనిల్ నమ్ముతున్నట్లు తెలుస్తోంది. వెంకటేష్ ఇప్పటికే 'ఆదర్శ కుటుంబం' సినిమా పనుల్లో బిజీగా ఉండగా, ఆ గ్యాప్‌లోనే అనిల్ ఈ స్క్రిప్ట్ పనులు పూర్తి చేసినట్లు సమాచారం. ఇది మల్టీస్టారర్ కాదని, కేవలం వెంకటేష్ లీడ్ రోల్‌లో సాగే స్టాండలోన్ సినిమా అని ఇన్‌సైడ్ రిపోర్ట్. పక్కా లోకల్ నేటివిటీతో సాగే ఈ కథలో ఫాహద్ ఫాసిల్ పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని బజ్ వినిపిస్తోంది. ఇక అనిల్ రావిపూడి తన నెక్ట్స్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ దగ్గర మరో పెద్ద బాంబు పేల్చేలా కనిపిస్తున్నారు. వెంకటేష్ ఫాహద్ ఫాసిల్ కాంబినేషన్‌పై వస్తున్న ఈ లీక్స్ నిజమైతే గనుక అది టాలీవుడ్‌లోనే వన్ ఆఫ్ ద బిగ్గెస్ట్ కాస్టింగ్ అవుతుంది. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై అనిల్ అఫీషియల్‌గా ఎప్పుడు క్లారిటీ ఇస్తారో చూడాలి.

# ఆ లిస్టులో ఇండియాలోని మొదటి మూవీగా వారణాసి



ఒక సినిమాకు హైప్ ఎలా క్రియేట్ చేయాలనేది రాజమౌళికి తెలిసినంత బాగా ఇండియాలో మరెవరికీ తెలియదనడంలో ఎలాంటి అనుమానం అక్కర్లేదు. బాహుబలి ఫ్రాంచైజ్ సినిమాలతో పాటూ ఆర్‌ఆర్‌ఆర్ మూవీతో తెలుగు సినిమా స్థాయితో పాటూ, సినిమా ప్రమోషన్స్‌ను నెక్ట్స్ లెవెల్‌కు తీసుకెళ్లిన రాజమౌళి తన సినిమా కోసం ప్రతీదీ చాలా కొత్తగా ఆలోచిస్తారు. ఏం చేస్తే తన సినిమా అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది? కథను ఎలా చెప్తే అందరికీ అర్థమవుతుంది? ఎలాంటి సీన్స్, విజువల్స్ పడితే ఆడియన్స్ స్టన్ అవుతారు? ఎలాంటి కొత్త ప్రదేశాలను చూపిస్తే ప్రేక్షకులు ఫిదా అవుతారు ఇలా ప్రతీ విషయంలోనూ చాలా కొత్తగా ఆలోచిస్తారు జక్కన్న. అందుకే ఆయన సినిమాలకు దేశవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్ బ్రహ్మరథం పడతారు. రాజమౌళి తన ప్రతీ సినిమా విషయంలోనూ ఇంతే ఆలోచిస్తారు. ఇక అసలు విషయానికొస్తే ఆర్‌ఆర్‌ఆర్‌తో ఎన్నో రికార్డులను సృష్టించడంతో పాటూ ఆస్కార్ టాలీవుడ్‌కు ఆస్కార్‌ను కూడా తీసుకొచ్చిన జక్కన్న, ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా వారణాసి అనే సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచర్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ పాన్ వరల్డ్ మూవీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టైటిల్‌ను లాంచ్ చేస్తూ రిలీజ్ చేసిన గ్లింప్స్‌తోనే వారణాసి వరల్డ్ వైడ్‌గా ట్రెండ్ అయింది. అయితే ఈ మూవీ కోసం రాజమౌళి ఇప్పుడు మరో సాహసం చేస్తున్నట్టు తెలుస్తోంది. వారణాసి సినిమాను అంటార్కిటికాలో షూటింగ్ చేయనున్నట్టు సమాచారం. త్వరలోనే చిత్ర బృందం లొకేషన్లను వెతకనున్నారని, సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలను అంటార్కిటికాలోని విస్తృతమైన వాతావరణ పరిస్థితుల్లో, మునుపెన్నడూ చూడని ప్రదేశాల్లో షూట్ చేయనున్నారని తెలుస్తోంది. అదే జరిగితే అంటార్కిటికాలో షూట్ చేయబడిన మొదటి ఇండియన్ సినిమాగా వారణాసి చరిత్రకెక్కుతుంది. ఇప్పటివరకు ఇండియాలో ఏ సినిమానీ అక్కడ షూట్ చేసింది లేదు. ఇంకా చెప్పాలంటే ప్రపంచం మొత్తంలోనే అంటార్కిటికాలో ఇప్పటి వరకు షూట్ చేసిన సినిమాలు నాలుగే. ఇప్పుడు వారణాసి ఐదో సినిమాగా చోటు సంపాదించుకోబోతుంది. త్వరలోనే మేకర్స్ దీనిపై ఓ అప్డేట్‌ను కూడా ఇచ్చే అవకాశముంది. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను ఏప్రిల్ 7, 2027న రిలీజ్ చేయనున్నారని సోషల్ మీడియాలో వార్తలొస్తున్నాయి. కానీ దీనిపై అధికారిక ప్రకటన మాత్రం రావాల్సి ఉంది.

# విజయ్ దేవరకొండ.. రెండు ఎపిక్ క్యారెక్టర్స్




టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ.. ఇప్పుడు వరుస సినిమాలతో ఫుల్ జోష్ మీద ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన రవి కిరణ్ కోలా దర్శకత్వంలో రౌడీ జనార్ధనతోపాటు రాహుల్ సాంకృత్యన్ డైరెక్షన్‌లో రణబాలి చిత్రాలు చేస్తున్నారు. ఇప్పటికే ఆ రెండు సినిమాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. అంతేకాకుండా ఆడియన్స్‌లో సూపర్ బజ్‌ను క్రియేట్ చేసుకున్నాయి. అయితే తాజాగా రౌడీ జనార్ధన, రణబాలి డైరెక్టర్స్ రవి కిరణ్, రాహుల్ పోస్ట్ చేసిన స్పెషల్ గ్లింప్స్.. ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్‌గా మారింది. ఓ రేంజ్‌లో ఆకట్టుకుని అందరినీ మెప్పిస్తోంది. నిజానికి ఆ రెండు చిత్రాలు వేర్వేరు జోనర్స్‌లో రూపొందుతుండగా.. వాటి నుంచి ఇటీవల గ్లింప్సెస్ రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అవి సినీ ప్రియులను విపరీతంగా ఆకర్షించాయి. తాజాగా ఆ గ్లింప్సెస్‌ను మిక్స్ చేస్తూ.. రాహుల్ సాంకృత్యాన్ షేర్ చేసిన వీడియో హాట్ టాపిక్‌గా మారింది. అందులో రాహుల్.. తాను పీరియాడికల్ రూరల్ డ్రామా మూవీ చేస్తున్నానని తెలిపారు. గొప్ప చిత్రం రూపొందుతోందని, ఇది తన ప్రామిస్ అంటూ రాసుకొచ్చారు. రవి కిరణ్ కోలాను ట్యాగ్ చేశారు. అయితే రెండు సినిమాల గ్లింప్సెస్‌లోని విజువల్స్‌ను అదిరిపోయే రీతిలో ఒకే చోట చూపించారు. వీడియో చివర్లో.. 2026 సెప్టెంబర్, డిసెంబర్ అని ఉండడం ప్రత్యేకంగా నిలిచింది. తద్వారా రౌడీ జనార్ధన, రణబాలి సినిమాలు.. ఆ నెలల్లో రిలీజ్ అవ్వనున్నట్లు తెలుస్తోంది. అదే వీడియోను షేర్ చేసిన డైరెక్టర్ రవికిరణ్ కోలా.. ఒకే లక్ష్యమంటూ సింపుల్‌గా రాసుకొచ్చారు. తద్వారా ఇద్దరూ కలిసి.. విజయ్ దేవరకొండకు బిగ్గెస్ట్ హిట్స్ ఇవ్వాలని డిసైడ్ అయినట్లు క్లియర్‌గా తెలుస్తోంది. అయితే ఇప్పుడు స్పెషల్ వీడియో చూసిన నెటిజన్లు.. ప్రశంసలు కురిపిస్తున్నారు. ఓ రేంజ్‌లో ఉందని కొనియాడుతున్నారు. ఒకే హీరో.. రెండు అద్భుతమైన పాత్రలు... సిల్వర్ స్క్రీన్ కోసం రెండు అద్భుతమైన కథలు అంటూ చెబుతున్నారు. కచ్చితంగా విజయ్ దేవరకొండకు బ్లాక్ బస్టర్ హిట్స్ ఖాయమని అంచనా వేస్తున్నారు. వెయిటింగ్ ఫర్ మూవీస్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఇక రౌడీ జనార్ధన సినిమా విషయానికొస్తే.. 80స్ కాలంలో తూర్పుగోదావరి నేపథ్యంలో జరిగిన సంఘటన ఆధారంగా తెరకెక్కుతోందని తెలుస్తోంది. మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా సినిమాను తీర్చిదిద్దుతున్నారు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా యాక్ట్ చేస్తుండగా.. దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఆ తర్వాత రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రణబాలి మూవీ రూపొందుతోంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. మరి రౌడీ జనార్ధన, రణబాలి ఎలాంటి హిట్స్ అవుతాయో వేచి చూడాలి.

# శ్రీనివాస మంగాపురం.. 'మంగ' గా బాలీవుడ్ బ్యూటీ




టాలీవుడ్‌లో ప్రస్తుతం కొత్త టాలెంట్‌కు కొదవలేదు. వారసత్వంతో వచ్చే వాళ్లే కాకుండా, ఇతర భాషల నుండి క్రేజీ నటీనటులు కూడా మన దగ్గర పాగా వేస్తున్నారు. ఇప్పుడు ఒక ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ గురించి సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. అజయ్ భూపతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'శ్రీనివాస మంగాపురం' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా ద్వారా సూపర్ స్టార్ కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్నారు. హీరో డెబ్యూ అప్‌డేట్‌తోనే ఈ ప్రాజెక్ట్‌పై మంచి బజ్ క్రియేట్ అయ్యింది. అజయ్ భూపతి అంటేనే ఒక కల్ట్ రోమాంటిక్ యాక్షన్ స్టైల్ గుర్తుకొస్తుంది. ఆయన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు చాలా వెయిటేజ్ ఉంటుంది. అందుకే ఈ సినిమాలో హీరోయిన్‌గా ఎవరిని తీసుకుంటారనేది కొంతకాలంగా సస్పెన్స్‌గా మారింది. రీసెంట్‌గా ఈ విషయంలో చిత్ర బృందం ఒక క్లారిటీ ఇచ్చింది. బాలీవుడ్ సీనియర్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని ఈ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. ఇప్పటికే బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్న రాషా, ఇప్పుడు మన టాలీవుడ్ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ంశ్రీబనీ ఖీవజీట – ఎట్టకేలకు జై భీమ్‌కు గౌరవం దక్కింది లేటెస్ట్‌గా ఈ సినిమా నుండి హీరోయిన్ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో రాషా 'మంగ' అనే పాత్రలో నటిస్తున్నట్లు రివీల్ చేశారు. ట్రెడిషనల్ లుక్‌లో రాషా చాలా క్యూట్‌గా కనిపిస్తోంది. ఆమె ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే ఈ సినిమాలో పర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న క్యారెక్టర్‌లోనే నటిస్తోందని అర్థమవుతోంది. ఇప్పటికే 'ఉయి అమ్మ' గర్ల్‌గా నెట్టింట ఫుల్ పాపులారిటీ ఉన్న రాషాకు, ఈ తెలుగు డెబ్యూ సినిమా మరింత మైలేజీని ఇస్తుందని ఫిలిం నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే మధ్యప్రదేశ్‌లో దాదాపు 30 రోజుల పాటు మొదటి షెడ్యూల్ పూర్తి చేశారు. సినిమాలోని సుమారు 30 శాతం షూటింగ్ కంప్లీట్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం రెండో షెడ్యూల్‌లో కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు సాంగ్స్ ను కూడా చిత్రీకరిస్తున్నారు. 2026 లో ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రొడక్షన్ వాల్యూస్ విషయంలో ఎక్కడా తగ్గకుండా టీమ్ మొత్తం పక్కా ప్లానింగ్‌తో ముందుకు వెళ్తోంది. లెజెండరీ ప్రొడ్యూసర్ అశ్వినీ దత్ సమర్పణలో, పి.కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ఈ ప్రాజెక్ట్‌కు అదిరిపోయే ట్యూన్స్ ఇస్తున్నారట. ఒక మంచి లవ్ స్టోరీకి పవర్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్ తోడైతే రిజల్ట్ ఎలా ఉంటుందో అజయ్ భూపతి గత సినిమాలతో నిరూపిం చారు. అదే మ్యాజిక్ ఇక్కడ కూడా రిపీట్ అవుతుందని టీమ్ ధీమాగా ఉంది. జయకృష్ణ, రాషా జంట స్క్రీన్ మీద ఫ్రెష్‌గా ఉండటం సినిమాకు పెద్ద ప్లస్ పాయింట్ కానుంది. హీరో, హీరోయిన్ల ఫస్ట్ లుక్‌లతోనే సినిమాపై పాజిటివ్ వైబ్ క్రియేట్ అయ్యింది. రాషా తడాని తన గ్లామర్‌తో పాటు యాక్టింగ్‌తో తెలుగు ఆడియన్స్‌ను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి.

# మహాజన టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించి హోమ్ మంత్రి వంగలపూడి అనిత





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** మహాజన టీచర్స్ అసోసియేషన్ సంఘము గత సంవత్సరము పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశీస్సులతో ఏర్పాటు చేసిన విషయం అందరికి తెలిసిన విషయమే. ఈ సంవత్సరం హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత చేతుల మీద వెలగపూడి సచివాలయం యందు ఆవిష్కరించడం జరిగిందని ఎంటిఏ డైరీ నిర్వహణ కమిటీ తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మస్తాన్ మాదిగ చేమూరు వారు మాట్లాడుతూ మీూ సంఘము టీచర్స్‌కు ఏ సమస్య వచ్చినవాళ్ళ సమస్యలు పరిష్కరించే దిశగా పని చేస్తుందని, ముమ్ముందు మీూ సంఘానికి మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పినారు. అదే క్రమంలో అత్యవసర సమావేశాల దృష్ట్యా ఫ్లైట్‌లో వేరే ప్రదేశానికి వెళ్ళవలసిన పరిస్థితిలో ఫ్లైట్ టైమ్ అయిపోతుందని తెలిసి కూడా హుటాహుటిగా మహాజన టీచర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించి, రాష్ట్ర కమిటీని మంచి మనుసుతో దీవించిన హోమ్ మినిస్టర్ వంగలపూడి అనితమ్మకి కృతజ్ఞతలు తెలియజేసినట్లు మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య కొనియాడారు.

ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పందల భాస్కర్, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాకుమాని జ్యోతి, తిరుపతి జిల్లా ఇంచార్జ్ మరియు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొర్రిపాటి పీరయ్య మాకు దగ్గర ఉండి ఎంటిఏకు సహాయ, సహకారాలు అందించిన ఎంఆర్‌పిఎస్, ఎంఇఎఫ్ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం, బంగ్లాదేశ్ సుందర్బన్ అంతర్జాతీయ ప్రాదేశిక జలాల్లో మత్స్యకారులు విడుదల





**కోవూరు, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ సముద్ర సరిహద్దు రేఖను అనుకోకుండా దాటిన భారతీయ జాలర్లను ఇటీవల బంగ్లాదేశ్ అధికారులు అరెస్టు చేశారు. బంగ్లాదేశ్ జాలర్లను కూడా భారత అధికారులు అదేవిధంగా అరెస్టు చేశారు. భారత్ బంగ్లాదేశ్ ప్రభుత్వాలు గురువారం (జనవరి 29న 23 మంది భారతీయ మత్స్యకారులను మరియు 128 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులను, వారి పనిచేసే పడవను విడుదల చేసి స్వదేశానికి తిరిగి పంపించే కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించాయి. 2025 జనవరి మరియు డిసెంబర్‌లలో, భారత ప్రభుత్వం 142 మంది భారతీయ మత్స్యకారులను విడుదల చేయడానికి వీలు కల్పించింది మరియు పరస్పరం 128 మంది బంగ్లాదేశ్ మత్స్యకారులను విడుదల చేయడం పట్ల ఈస్ట్ కోస్ట్ మేకనైజడ్ ఫిషింగ్ బోటు ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ వాసుపల్లి జానకిరామ్ కృతజ్ఞతలు తెలిపారుభారత్ బంగ్లాదేశ్ దేశాలు మత్స్యకార వర్గాల మానవతావాద మరియు జీవనోపాధి సమస్యలను దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు మరియు వారి ఫిషింగ్ బోట్లతో సహా పరస్పర మార్పిడిని కార్యక్రమం గురువారం 10 గంటల నుండి 4 గంటల మధ్య అంతర్జాతీయ ప్రాదేశిక జలాలలో ఇండియన్ కోస్ట్ గార్డ్ మరియు బంగ్లాదేశ్ కోస్ట్ గార్డ్ సమన్వయంతో కలిసి పూర్తి చేశాయని ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ప్రెసిడెంట్ జానకిరామ్ వాసుపల్లి తెలిపారు. జైలు శిక్ష సమయంలో భారత జాలర్ల శ్రేయస్సును భారత హైకమిషన్ పర్యవేక్షించి, వారికి జైలో ఉన్న భారతీయ మత్స్యకారులకు మరియు అవసరమైన వస్తువులను అందించింది. భారత ప్రభుత్వం భారతీయ జాలర్ల భద్రత,



భద్రత మరియు సంక్షేమానికి అత్యంత ప్రాముఖ్యతను ఇవ్వటం. మత్స్యకారులు బాగర్ హాట్ జైల్ నుండి విడుదల చేయడం దగ్గర నుంచి ఫిషింగ్ బోట్ల రిపేర్, మత్స్యకారులకు ప్రయాణంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం, భారత ప్రాదేశిక జలాల్లో ఇండియన్ కోస్ట్ గార్డ్ పూర్తి స్థాయి సహకారం మత్స్యకారులు అందే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని ఇండియన్ హై కమిషన్ డాకా, అసిస్టెంట్ హై కమిషన్ ఆఫ్ ఇండియా– కుల్నా బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ అధికారులు చేసిన సహకారానికి ఈస్ట్ కోస్ట్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జానకిరామ్ వాసుపల్లి ధన్యవాదాలు తెలియజేశారు. భారత ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించిన ఉత్తరాంధ్ర మత్స్యకారులు రెండు రోజులలో విశాఖ చేరుకుంటారని తెలిపారు.ఇది సందర్భంగా ఫిష్ కాన్ ఏపీ డైరెక్టర్ ప్రళయ కావేరి వేణు గోపాల్ మాట్లాడుతూ మానవత్వంతో సంయుక్తంగా పని చేసి సపలీకృతం చేసిన వాసుపల్లికి అభినందనలు తెలిపారు.

# మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వాసుపల్లి కుటుంబ సభ్యులు

### - తమ రెండో కుమారుడు వివాహానికి హాజరు కావాలని జగన్‌కు పెళ్లి కార్డు అందచేత - వివాహానికి తప్పకుండా హాజరవుతానని జగన్ హామీ


**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖ దక్షిణ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కుటుంబ సభ్యులు గురువారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ రెండవ కుమారుడు గోవింద సాకేత్ వివాహానికి తప్పకుండా హాజరు కావాలంటూ పెళ్లి కార్డును ఆయనకు అందజేస్తూ పట్టు వస్త్రాలు, శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి పంచలోహ విగ్రహము బహుకరించారు.

తప్పకుండా ఈ వివాహానికి తాను హాజరవుతానని ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి తెలియజేశారు. వాసుపల్లి గణేష్ కుమార్, ఉషారాణి దంపతులు, పెద్ద కుమారుడు సూర్య



ఆయన సతీమణి రాశి అలాగే రెండవ కుమారుడు గోవింద సాకేత్ పాల్గొని జగన్ మోహన్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు.

# వెంకటగిరి కేంద్రంగా నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోండి : తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు






**డక్కిలి, (రాజధాని వార్తలు):** వెంకటగిరి విశ్వోదయ గ్రౌండ్‌లో నిర్వహించే రెవెన్యూ క్లినిక్‌ను డక్కలి మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న భూ సంబంధిత సమస్యలను ఈ రెవెన్యూ క్లినిక్‌లో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ క్లినిక్‌కు వచ్చే ప్రజలు అవసరమైన అన్ని భూ సంబంధిత పత్రాలు, కార్డులతో హాజరు కావాలని తెలిపారు. ఈ రెవెన్యూ సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్‌తో పాటు శ్రీకాళహస్తి ఆర్డీవో హాజరవుతున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు.

# శ్రీశ్రీశ్రీ గౌరీ విశ్వేశ్వర ఆలయ 20వ వార్షికోత్సవ మహోత్సవములో రాజు గౌడ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీశ్రీ గౌరీ విశ్వేశ్వర ఆలయం పురుషోతపురం 20వ వార్షిక మహోత్సవాలు 27 వ తేదీ నుంచి ఈరోజు 29 వతేది భీష్మ ఏకాదశి రోజున భారీ అన్నసంతర్పణతో ముగిసాయి. మొదటి రోజు సుబ్రహ్మణ్య స్వామికి రెండవరోజు సాయిబాబా వారికి మూడవరోజు గౌరీ విశ్వేశ్వరులకు ప్రత్యేక పూజలు ఆరాధనలు తిరువీధి రథయాత్రలు నిర్వహించి ఈరోజు 2500 మందికి అన్నసంతర్పణ చేయడం జరిగినది. భక్తులు అనేకమంది స్వాములను దర్శించుకొన్నారు. స్వామివారిని ఉత్తరాంధ్ర రాష్ట్రీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు గౌడ్ జాతీయ బీసీ ప్రజా సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి కోసూరి శ్రీనివాసరావు ప్రముఖ సంఘసంస్కర్త ప్రొఫెసర్ డికె రెడ్డి అనేక మంది స్థానిక రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ఆలయానికి విచ్చేసి స్వామివారి దర్శనం చేసుకున్నారు కమిటీ వారు భక్తులకు అన్ని సదుపాయాలను కలుగజేశారు.

# పాటూరులో పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి నలపరెడ్డి ప్రసన్న







**కోవూరు, (రాజధాని వార్తలు):** కోవూరు మండలం, పాటూరు గ్రామం కామాక్షమ్మ కాలనీలో వైసీపీ నాయకులు సుంకర మోహన్ సతీమణి సుంకర భారతి ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో గురువారం పాటూరు గ్రామంలోని వారి స్వగృహానికి స్వర్గీయ సుంకర భారతి చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి రాష్ట్ర పిఏసి సభ్యులు పరామర్శించడం జరిగింది. పాటూరు గ్రామంలోని గాజుల వీధిలో వైసీపీ నాయకులు నాగిశెట్టి మురళి తండ్రి నాగిశెట్టి వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో నేడు పాటూరు గ్రామంలోని వారి స్వగృహానికి స్వర్గీయ నాగిశెట్టి వెంకయ్య కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. పాటూరు గ్రామంలోని గాజుల వీధిలో వైసీపీ నాయకులు చిట్టెంశెట్టి రమణయ్య సతీమణి చిట్టెంశెట్టి జయమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో గురువారం పాటూరు గ్రామంలోని వారి స్వగృహానికి స్వర్గీయ చిట్టెంశెట్టి జయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిశీలకులు మాజీ ఆఫ్కాఫ్ ఛైర్మెన్ కొండూరు అనిల్ బాబు, జిల్లా రైతు విభాగం అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి కోవూరు మండలం అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, ఎర్రంరెడ్డి ఆదినారాయణ రెడ్డి గండవరపు విజయ సేనారెడ్డి సందీప్ రెడ్డి జయవర్ధన్ రెడ్డి, అబ్బారెడ్డి, రామిశెట్టి శేషయ్య ఉన్నారు.



# 29వ వార్డులో శాశ్వత పరిష్కారం దిశగా సోలార్ లైట్లు రిపేర్లు వార్డు

### - జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** 29వ వార్డు స్మార్ట్ వార్డు కావడంతో మెయిన్ రోడ్లలో కూడా సోలార్ లైట్లు ఎక్కువగా ఉన్నవి అయితే వీటిని ఎన్ని సార్లు రిపేర్లు చేయించినా కూడా మధ్య రాత్రుల్లో ఆగి పోతున్నాయి. స్థానికుల నుండి వచ్చిన పిర్యాదులు మేరకు విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ దృష్టికి మరియు సోలార్ లైట్ కాంట్రాక్టర్ కిషోర్ దృష్టికి 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్ తీసుకు వెళ్ళడం జరిగింది. జగదాంబ కూడలి, దండుబజార్, అంగటి దిబ్బ, కొల్లూరు మెన్షన్ మొదలగు ఏరియాల్లో సోలార్ లైట్లు ఇబ్బందిగా ఉన్నదని శాశ్వత పరిష్కారం చేయాలని కాంట్రాక్టర్‌తో మాట్లాడగా సాఫ్ట్వేర్ టెక్నాలజీ ద్వారా సమస్యను గుర్తించి అప్డేట్ చేసి శాశ్వత పరిష్కారం రెండు రోజుల్లోగా చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. తొలుత సమస్యను తనిఖీలు నిర్వహిస్తామని తర్వాత సాఫ్ట్వేర్ టెక్నాలజీతో సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ కృషి చేస్తున్నందుకు స్థానికులు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# నిబద్ధత గల కార్యకర్తల కృషి ఫలితంగానే టిడిపికి 164 సీట్లు వచ్చాయి

**- ఐకమత్యంగా ఉండండి, ప్రతిపక్ష పార్టీల విమర్శలకు దీటుగా సమాధానం చెప్పండి - పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అక్రమ కేసులకు గురై జైళ్ళ కెళ్ళిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది - కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి - ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రతి మండలంలో కార్యాలయాల ఏర్పాటు - పార్టీకి చెడ్డ పేరు తెచ్చే పనుల కోసం అధికారులపై ఒత్తిడి తేవద్దు - ప్రజా సమస్యల పరిష్కార విషయంలో అధికారులు నాయకులకు సహకరించాలి - ప్రతి మండలంలో నెలకోసారి కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి పార్టీని సంస్థాగతంగా బలవంతం చేస్తాను - ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కార్యకర్తలు పని చేయాలి - కోవూరు మండల టిడిపి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**







**కోవూరు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్‌ల స్ఫూర్తితో కార్యకర్తలు పని చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వారానికోసారి గ్రామస్థాయిలో... నెలకోసారి మండల స్థాయిలో నాయకులను సమన్వయం చేసుకొని కార్యకర్తల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని గ్రామ మండల పార్టీ అధ్యక్షులకు సూచించారు. గ్రామ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన నాయకులు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలన్నారు కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పి కొట్టాలని టిడిపి నాయకులు కార్యకర్తలకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆదేశించారు. గత వైసిపి పాలనలో అక్రమ అక్రమ కేసులు ఎదుర్కొని జైళ్ల కెళ్లిన కార్యకర్తలకు పార్టీ ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. నిబద్ధతగల కార్యకర్తల కృషి ఫలితంగానే 2024లో తెలుగుదేశం పార్టీ 164 సీట్లు సాధించి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆత్మీయ సమావేశంలో చంద్రన్న భీమా గురించి ప్రస్తావించిన నాయకులకు ఆమె సమాధానమిస్తూ అనారోగ్య బాధితుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మానవత్వంతో స్పందిస్తూ కోవూరు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 7 కోట్ల రూపాయలు సహాయం చేసిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో నాయకులకు సహకరించాలని ఆమె అధికారులకు ఆదేశించారు. పార్టీకి చెడ్డ పేరు తెచ్చే అక్రమ గ్రావెల్ ఇసుక తవ్వకాలకు సంబంధించిన పనుల కోసం అధికారులపై ఒత్తిడి తేవద్దని నాయకులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి, తల్లికి వందనం, మత్స్యకార సేవలలో తదితర సంక్షేమ పథకాలు మరియు కోట పేపర్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత గ్రామ గ్రామాన జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకులు మరియు కార్యకర్తలను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాలలో త్వరలోనే పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటించారు. సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకొని గ్రామస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కార్యకర్తలకు హితోపదేశం చేశారు. కార్యకర్తలతో సహకరించే విధంగా మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి సచివాలయ సిబ్బందికు దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన ఇంటి తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటాయన్నారు. నాయకులు, కార్యకర్తలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనతో వచ్చి చెప్పుకోవచ్చు అని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని తాను ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అలకలు వీడి నాయకులు అందరూ ఐకమత్యంగా తనకు అండగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి టిడిపి నాయకులు మరియు కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, కోవూరు టిడిపి మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూరు సుధాకర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇంత మల్లారెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, జెట్టి మదన్ రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షులు అతిపల్లి శివారెడ్డి, జిల్లా టిడిపి కార్యదర్శి యాకసిరి వెంకటరమణ రమణమ్మ, కోవూరు సర్పంచ్ యాకసిరి విజయమ్మ, ఎంపీపీ తుమ్మల పార్వతి, టీడీపి సీనియర్ నేత విన్నకోట రాఖీ, నాటక రాణి వెంకట్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ముసలి సుధాకర్, మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ లతో పాటు టిడిపి యూనిట్, క్లస్టర్ మరియు బూత్ కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా కోవూరును తీర్చిదిద్దుతాను

**- కోవూరు పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి - పట్టణంలో 23 లక్షల వ్యయంతో సిసి రోడ్ల ప్రారంభోత్సవం**
**- 84 లక్షలతో రెండు విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, 89 లక్షలతో శిథిలావస్థకు చేరిన కోర్టు భవనాల మరమ్మతులు - 20 నెలల్లో మౌలిక సదుపాయలు కల్పించేందుకు 6 కోట్ల 50 వెచ్చించాం - 50 లక్షలతో లక్షలతో పీటర్స్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మాణం చేసి దశాబ్దాల కోవూరు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాం**
**- కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలు మారుస్తున్నాయి : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

**కోవూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక ఒకవైపు ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందిస్తూనే.. మరోవైపు డ్రైన్లు, సిసి రోడ్లు మరియు తాగునీరు లాంటి మౌలిక వసతుల కల్పనలోతో గ్రామాల రూపురేఖలు మారుస్తున్నామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కోవూరు పట్టణంలోని 13 వ వార్డులలో 18 లక్షలతో 14 వార్డులో 15 లక్షలతో సిసి రోడ్లు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి స్థానిక నాయకులు కార్యకర్తలుఅపూర్వ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ 20 నెలలకు ముందు ఎక్కడ చూసినా గుంతల రోడ్లు, అస్తవ్యస్తమైన డ్రైనేజ్ వ్యవస్థతో వున్న కోవూరు పట్టణం నేడు అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. కూటమి వచ్చాక విపిఆర్ ఫౌండేషన్ ద్వారా "క్లీన్ కోవూరు" పేరిట డ్రైనేజ్ కాలువలలో సిల్ట్ క్లియరెన్స్ నుంచి మొదలు పెట్టి దశల వారీగా రోడ్లు, డ్రైన్లు లాంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అభివృద్ధిలో కోవూరును అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. కోవూరు అంటే అభివృద్ధికి చిరునామా అనిపించేలా కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 20 నెలల్లో వివిధ అభివృద్ధి పథకాలకు సంబంధించిన 1 కోటి 76 లక్షల రూపాయలతో సిసి రోడ్లు నిర్మించుకున్నామన్నారు. డ్రైన్లు మరియు తాగునీటి అవసరాల కోసం 1 కోటి 08 లక్షలు వెచ్చించామన్నారు. దశాబ్దాల తరబడి కోవూరు వాసులు ఎదుర్కుంటున్న ట్రాఫిక్ సమస్యను పీటర్స్ కెనాల్‌పై 50 లక్షలతో బ్రిడ్జ్ నిర్మించి పరిష్కారించిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసారు. 84 లక్షలతో రెండు విలేజ్ హెల్త్ సెంటర్లు, 89 లక్షలతో శిథిలావస్థకు చేరిన కోర్టు భవనాల మరమత్తులు ఇలా ఒక్క కోవూరులోనే దాదాపు 6 కోట్ల 50 లక్షలతో చేసిన అభివృద్ధి పనులను ఆమె ప్రస్తావించారు. మరో 58 లక్షలతో కోవూరు చెరువు కట్ట అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అర్హత పొందేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించి కోవూరు పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేసి జిల్లాలోనే ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. గత ప్రభుత్వం 15 వ ఆర్థిక సంఘ నిధులను పక్కదారి పట్టించి దుర్వినియోగం చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 15వ ఆర్థిక సంఘానికి చెందిన ప్రతి రూపాయి అభివృద్ధికి వెచ్చిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలవుతున్న సూపర్ సిక్స్ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలు మార్చాయన్నారు. ప్రజల ఆదరాభిమానాలే తనకు కొండత బలమని ప్రజలకు ఏ సమస్య వున్నా నేరుగా తన వద్దకు వస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీనియర్ నాయకుల సలహాలు, సూచనలను తీసుకొని కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి రెడ్డి, పెన్న డెల్టా చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, స్థానిక సర్పంచ్ యాకసిరి విజయమ్మ, ఎంపీపీ తుమ్మల పార్వతి, టిడిపి మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి,జిల్లా పార్లమెంట్ టీడీపి కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు ఇంతా మల్లారెడ్డి,కాటం రెడ్డి కృష్ణా రెడ్డి, అత్తి పల్లి శివ ప్రసాద్ రెడ్డి, యర మా కల రమణా రెడ్డి జిల్లా టిడిపి కార్యదర్శి యాకసిరి వెంకట రమణమ్మ, టీడీపి నాయకులు విన్నకోట రాఖీ, మైనార్టీ టీడీపి నేత పిరోజ్,, పామంజి శ్రీనివాసులు, కొమరి ఆది నారాయణ, టిడిపి యూనిట్, క్లస్టర్, బూత్ కమిటీ కన్వీనర్లు గాదిరాజు అశోక్, గాది రాజు సుధాకర్, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.





# రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉంటాం

**- 11 డిమాండ్ల సాధనకు ప్రభుత్వం ద్వారా కృషి - ఫెడరేషన్ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన**

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి తమ వంతు కృషి చేయడంతో పాటు తమ పరిధి మేరకు అండగా ఉంటామని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (ఎన్ఎజె) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం రెండో రోజు గురువారం కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఏపీ ఎన్జీవో హోంలో అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా వీరు పలువురు జర్నలిస్టులకు నూతన సభ్యత్వకార్డులు అలాగే రెన్యూవల్ కార్డులు వాహనాలకు సంబంధించి యూనియన్ పేరుతో ఉన్న స్టిక్కర్స్ అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో వీరు మాట్లాడుతూ గత ఏడాది 600 మంది తమ యూనియన్ లో సభ్యత్వ నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. అనకాపల్లి అల్లూరి జిల్లాల్లో కూడా త్వరలో నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. జర్నలిస్టులకు సంబంధించిన ప్రధానమైన 11 డిమాండ్ల సాధనకు తమ రాష్ట్ర కార్యవర్గం ద్వారా కృషి చేస్తున్నామన్నారు. అర్హులైన జర్నలిస్టులు అందరికీ త్వరలోనే అక్రిడేషన్లు అందనున్నాయని అలాగే ఇళ్ల స్థలాలు పెన్షన్ వంటి సదుపాయాల కోసం కూడా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కొన్ని డిమాండ్లు సాధించుకోవడం జరిగిందన్నారు. వారం రోజులు పాటు ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కావున వర్కింగ్ జర్నలిస్టులు అందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేసుకోవాలని అలాగే పాత సభ్యులు రెన్యువల్ కార్యక్రమాన్ని ముగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు పి నారాయణ్, విశాఖ జిల్లాకార్యదర్శి జి. శ్రీనివాస రావు, ఏపీబీజేఏ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బొబ్బర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, వై రవి కుమార్, రాజేష్, ప్రసాద్, కన్నబాబు, ఆశాలత, రమేష్ తదితరులతోపాటు పెద్ద ఎత్తున జర్నలిస్టులు పాల్గొన్నారు.




# ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఘనంగా భీష్మ ఏకాదశి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పప్పుల వీధిలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానము నందు భీష్మ ఏకాదశి శుభ పర్వదిన సందర్భంగా 80 మంది దంపతులచే సామూహిక శ్రీ రమాదేవి వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి వ్రత కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వ్రతంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి వెండి ప్రతిమ ఇవ్వడం జరిగింది మరియు అన్నవరం నుండి తెప్పించినటువంటి రవ్వ ప్రసాదం మరియు బంగి ప్రసాదం ఇవ్వడం జరిగింది. తదుపరి 500 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. పై కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఈ యొక్క కార్యక్రమం 34 మంది ఉభయకర్తలు కలసి జై శ్రీ రామ హనుమాన్ భక్త బృందం వారి ఆధ్వర్యంలో జరిగింది . దేవస్థాన కార్యనిర్వాహన అధికారికి కమిటీ సభ్యులకు మా భక్త బృందం తరపున ధన్యవాదాలు తెలియజేయడమైనది.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM 9440662699


# పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : మాజీ ఎంపీ అనురాధ

## - కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది..భయపడవద్దు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** పార్టీని సంస్థగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర మహిళా విభాగం (జోన్ 2) వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ ఎంపీ చింతా అనురాధ అన్నారు.

డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన గురువారం కొత్తపేటలో జరిగిన కొత్తపేట నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల వివరిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఏ ఒక్కరు అధైర్య పడవద్దని ఆమె కార్యకర్తలకు ధైర్యం నింపారు. నిర్ణీత సమయంలో పార్టీ అనుబంధ కమిటీలను నియమించి కేంద్ర కార్యాలయానికి పంపాలన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్ఆర్సీపీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కారుమూరి సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు జక్కంపూడి విజయలక్ష్మి, వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శులు పాటి శివకుమార్, కర్రి నాగిరెడ్డి, సీఈసీ సభ్యులు, ఎస్ఇసి సభ్యులు, వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# వైభవోపేతంగా పట్టాభి రాముని కళ్యాణం



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** కేశవ పట్టాభిరామ స్వామి ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామంలో శ్రీ కేశవ పట్టాభిరామస్వామి దివ్య కళ్యాణం సందర్భంగా స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు వైభవోపేతంగా నిర్వహించారు. ఈ పూజల్లో ముఖ్య అతిధులుగా డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు పాల్గొన్నారు. వేద పండితుల మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణ అధికారి కారణం జగన్మోహన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున శ్రీ కేశవ పట్టాభిరామ స్వామివారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామాల్లో అత్యంత విశిష్టత, ప్రాచీన కాలంనాటి ఆలయం పట్టాభిరామ స్వామి ఆలయం అని, ఈ ఆలయానికి 800 సవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఆలయం దినదిన అభివృద్ధి చెందుతూ మనందరికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన స్వామివారి కళ్యాణ పూజల్లో తుమ్మల బాబు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజల్లో జనసేన నాయకులు, గ్రామ పెద్దలు, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

## - పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు





**అల్లవరం, (రాజధాని వార్తలు):** అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. తుమ్మలపల్లిలో సర్పంచ్ వడ్డీ సుభాషిని ఆధ్వర్యంలో గురువారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఎన్ఆర్ జిఎస్, సిఎస్ ఆర్ నిధులు రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివా లయ భవనం, రూ. 30 లక్షలతో నిర్మించిన ఎంపీపీ ప్రాథమిక పాఠ శాల భవనం, రూ.35 లక్షలతో నిర్మించిన ఓ హెచ్ ఆర్ వాటర్ ట్యాంక్, రూ. 42 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గోడి పంచాయతీ పరిధిలోని గోడిపాలెంలో రూ.14.30 వ్యయంతో నిర్మించిన ఎంపీపీ ప్రాథ మిక పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. తుమ్మలపల్లిలో సర్పంచ్ సుభాషిన ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆనంద రావును పూల కిరీటం గజమాలతో సత్కరించారు.

ఈ కార్యక్రమంలో గోడి సర్పంచ్ తోట శ్రీదేవి నరసిం హారావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పిటిసి కొనుకు గౌతమి, ఎంపీటీసీ పులుసు గంటి రాజేశ్వరి, కాంద్రేగుల వాణి అచ్యుతం, వడ్డీ ఎలీషా రాజు, నాగ బత్తుల గణపతి రావు, వడ్డీ వెంకటేశ్వరరావు, ఎలమంచిలి రమేష్, ఇస్మాయిల్, కడలి పృధ్వి, చింత సంపదరావు, వర్ధనపు లలిత తదితరులు పాల్గొ న్నారు.

# హెల్మెట్ తప్పనిసరి పై అవగాహనా ర్యాలీ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కె ప్రసాద్, ఎస్సై వి మౌనికలు అన్నారు. పెద్దాపురం మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం నుండి పట్టణంలో హెల్మెట్ వినియోగం వలన ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్ ధరించడం వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవా లన్నారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవంలో భాగంగా ఈ ర్యాలీ చేపట్టారు. ర్యాలీని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్




జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్స్, ఓనర్స్ పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan